
RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 64 ISSUE NO : 64 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | ఆదివారం,ఆగస్టు,24,2025 Sunday, August, 24 , 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-




## పుతిన్ తీరుపై ట్రంప్

# అసహనం

- త్రైపాక్షిక సమావేశం కోసం ఏర్పాట్లు చేస్తున్న ట్రంప్

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహంవ్యక్తం చేశారు. ఓవైపు తాను శాంతి చర్చ లు జరుపుతుంటే సహకరిస్తానని చెబుతూనే, మరోపక్క ఉక్రెయిన్ పై బాంబుల వర్షం కురిపిస్తున్నాడని మండిపడ్డారు. ఉక్రెయిన్‌లోని అమెరికాకు చెందిన ఫ్యాక్టరీపై రష్యా డ్రోన్ దాడులు చేయడంపై సీరియస్ గా స్పందించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే భారీ ఆంక్షలు తప్పవని హెచ్చరించారు. మూడేళ్లకు పైగా కొనసాగుతున్న రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు ట్రంప్ ఇటీవల రంగంలోకి దిగారు. తొలుత పుతిన్ తో, అనంత రం జెలెన్ స్కీతో భేటీ అయ్యారు. యుద్ధాన్ని ఆపేయాలని ఇరువు రు నేతలకూ నచ్చజెప్పారు. శాంతి చర్చల కోసం పుతిన్, జెలెన్ స్కీ ట్రంప్ ల మధ్య త్రైపాక్షిక భేటీ నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకోసం ట్రంప్ ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు.



## అంతరిక్ష సాంకేతికత భారతదేశ పాలనలో

# ఒక భాగం

## ప్రధాని నరేంద్రమోడీ

న్యూఢిల్లీ : భారత పాలనలో అంతరిక్ష సాంకేతికత యొక్క ఏకీకరణ పెరుగుతోందని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. సాంకేతికత వల్ల పంటల బీమా, విపత్తు నిర్వహణ, మౌలిక సదుపాయాల ప్రణాళిక రంగాలపై సాంకేతికత ప్రభావం తీవ్రంగా ఉ ంటుందని మోడీ చెప్పారు. శనివారం (ఆగస్టు 23) జాతీయ అంతరిక్ష దినత్సవం. ఈ సందర్భంగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో మోడీ మాట్లాడుతూ.. 'నేడు అంతరిక్ష సాంకేతికత భారతదేశ పాలనలో కూడా ఒక భాగంగా మారుతోంది. పంటల బీమా పథకంలో ఉపగ్రహ ఆధారిత అంచనా అయినా లేదా ఉపగ్రహాల ద్వారా మత్స్యకారులకు అందించే సమాచారం అయినా, భద్రత అయినా, విపత్తు నిర్వహణ అయినా, ప్రధానమ ంత్రి గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌లో జియోస్పేషియల్ డేటాను ఉపయో గించడం అయినా..నేడు అంతరిక్షంలో భారతదేశం సాధించిన పురోగతి సాధారణ పౌరుల జీవితాలను సులభ తరం చేస్తోంది' అని అన్నారు



# మరో రంగాన్ని టార్గెట్ చేసిన ట్రంప్

వాషింగ్టన్: ఉక్కు, అల్యూమినియం, ఆటోమొబైల్స్ వంటి రంగాల తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు ఫర్నిచర్ పరిశ్రమపై దృష్టి సారించారు. విదేశాల నుంచి దిగుమతి అవుతున్న ఫర్నిచర్‌పై కొత్తగా భారీ సుంకాలు విధించేందుకు సిద్ధమవుతు న్నట్లు ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు. ఈ విషయంపై తమ ప్రభుత్వం ఒక కీలక విచారణను ప్రారంభించబోతోందని శుక్రవారం ప్రకటించారు. ఈ మేరకు తన 'ట్రూత్ సోషల్' ప్లాట్‌ఫామ్‌లో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. రాబోయే 50 రోజుల్లో గా ఈ విచారణ ప్రక్రియ పూర్తవుతుంది" అని ఆయన పేర్కొన్నారు. ఫర్నిచర్‌పై ఎంత శాతం సుంకం విధించాలనేది ఇంకా నిర్ణయించలేదని, అయితే ఈ చర్య ద్వారా నార్త్ కరోలి నా, సౌత్ కరోలినా, మిచిగాన్ వంటి రాష్ట్రాల్లో ఫర్నిచర్ పరిశ్రమను తిరిగి నిలబె ట్టడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, అమె రికాలో ఫర్నిచర్ తయారీ రంగంలో జులై నాటికి 3,40,000 మంది పనిచేస్తున్నారు. ఈ సంఖ్య 2000 సంవత్సరంతో పోలిస్తే దాదాపు సగం మాత్రమే. ప్రస్తుతం అమెరికాకు ఫర్నిచర్ సరఫరా చేస్తున్న దేశాల్లో చైనా, వియత్నాం అగ్రస్థానంలో ఉన్నాయి. 2024 లో అమెరికా ఏకంగా 25.5 బిలియన్ డాలర్ల విలువైన ఫర్నిచర్‌ను దిగుమతి చేసుకున్న ట్లు ట్రేడ్ నివేదికలు చెబుతున్నాయి. జనవరిలో తిరిగి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ట్రంప్ పలు దేశాల ఉత్పత్తులపై కొత్త సుంకాలను విధిస్తూ వస్తున్నారు.

## 5 లక్షలతో పేదల ఇంటి నిర్మాణం

# అసాధ్యం

### కనీసం 12 లక్షలకు పథకం పెంచాలి

### మంత్రి పొంగులేటితో ఈటెల రాజేందర్ భేటీ

### మల్కాజిగిరి సమస్యలపై చర్చ

హైదరాబాద్, : బిజెపి ఎంపిలు అయినప్పటికీ.. రాష్ట్ర అభివృద్ధి కోసం అవసరమైన అనుమతులు, నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నా మని మల్కాజ్‌గిరి ఎంపి ఈటెల రాజేందర్‌అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు విషయంలో ఆయన శనివారం సచివాలయంలో గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు.





## ధర్మస్థల వ్యవహారం అంతా

# ఉత్తిదే

- అబద్ధాలతో బురిడీ కొట్టించిన ముసుగు వ్యక్తి
- తవ్వకాలతో పోలీసులను పరుగెత్తించిన భీమా
- అబద్ధమనిచెప్పడంతో అరెస్ట్ చేసిన సిట్

బెంగళూరు : ధర్మస్థల వ్యవహారం అంతా తూచ్ .. అన్నట్లుగా తయరయ్యింది. కర్ణాటకలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మస్థల సామూహిక మృతదేహాలు ఖననం కేసు కీలక మలుపు తిరిగింది. వందలాది మృతదేహాలను స్వయంగా తన చేత్తోనే ఖననం చేశానని ఫిర్యాదు చేసిన మాస్క్ మ్యాన్ భీమా అసలు రంగు బయటపడింది. పారిశుద్ధ్య కార్మికుడు ఇన్నాళ్లూ చేసిన ఆరోపణలు బూటకమేనని సిట్ అధికారుల దర్యాప్తులో తేలింది. తప్పుడు సమాచారం ఇచ్చి ప్రభుత్వాన్ని, ప్రజలను తప్పుదోవ పట్టించిన మాస్క్ మ్యాన్‌ను సిట్ అధికారులు అరెస్టు చేశారు.



## ఉత్తరాఖండ్ చమోలీలో

# క్లౌడ్ బరస్ట్

- బురదలో కూరుకుపోయిన ఇళ్లు
- కొట్టుకుపోయిన వాహనాలు, రోడ్లు

ఉత్తరాఖండ్: ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో క్లౌడ్ బరస్ట్ పెను విషాదాన్ని నింపింది. భారీ వర్షం కారణంగా థరాలీ మార్కెట్, కోట్‌దీప్, తహసీల్ కాంప్లెక్స్ సహా పలు ప్రాం తాలు జలమయమయ్యాయి. ఇళ్లు, ఎస్డీఎం నివాసంతో పాటు అనేక భవనాల్లోకి బురద నీరు పోటెత్తింది. అనేక వాహనాలు శిథిలా ల కింద కూరుకుపోయాయి. పట్టణం లోని వీధులన్నీ చెరువు లను తలపించాయి. సగ్వారా గ్రామంలో ఓ యువతి శిథిలాల కింద కూరుకుపోయి ప్రాణాలు కోల్పోయింది. వరదల కారణం గా పలువురు గల్లంతైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై ఉత్తరాఖ ండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## తక్షణం యూరియా సరఫరా

# చేయండి

### ఆర్ఎఫ్‌సిఎల్ సీఈఓ అలోక్ సింగాల్ తో తుమ్మల

హైదరాబాద్,తెలంగాణ దిశ : రాష్ట్రానికి ఆర్ఎఫ్‌సిఎల్ నుండి రావలసిన యూరి యా కోటాలో ఇంకా 62,473 మెట్రిక్ టన్నులు అందలేదని ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రానికి సరఫరా ఆలస్యమవ్వడంతో రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారని మంత్రి తెలిపారు. రైతుల పంటలపై ప్రతికూల ప్రభావం పడకముందే, రాష్ట్రానికి రావాల్సిన యూరియా సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు.





# మంచి మిత్రుడిని కోల్పోయా

## బండారు దత్తాత్రేయ భావోద్వేగం

- సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి నివాళు లర్పించిన దత్తాత్రేయ
- కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన వైనం
- సురవరం తుదిశ్వాస వరకు నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడారని కితాబు

హైదరాబాద్,తెలంగాణ దిశ : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సిద్ధాంతాలు వేరైనా సురవరం తనకు అత్యంత ఆత్మీ య మిత్రుడని, ఆయనను కోల్పో వడం వ్యక్తిగతంగా తీరని లోటని ఆవేదన చెందారు. సురవరం భౌతికకాయానికి దత్తాత్రేయ పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శిం చి, వారికి తన ప్రగాఢ సానుభూ తిని తెలియజేశారు. ఈ సంద ర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ సురవరంతో తనకున్న అనుబం ధాన్ని గుర్తు చేసుకున్నారు.



## కార్మికుల సంఘం నుంచి

# కవిత ఔట్..?

అదిలాబాద్,తెలంగాణ దిశ : రాజకీయాలలో వ్యక్తిగత అవసరాలు మాత్రమే ఉంటాయి. వ్యక్తిగత అవసరాల కోసం నాయకులు ఏమైనా చేస్తారు. ఎంతకైనా తెగిస్తారు. చివరికి తమ ప్రయోజనాల కోసం కుటుంబ సభ్యులను దూరం చేసుకోవడానికి, దూరం పెట్టడానికి వెనుకాడరు. ఇప్పుడు ఇక సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చింది కాబట్టి విష ప్రచారానికి.. అడ్డగోలు వ్యక్తీకరణలలో ఏమాత్రం తగ్గరు.పై ఉపోద్ఘాతం మాదిరిగానే ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో పరిస్థితి కనిపిస్తోంది. కొంతకాలంగా జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవితకు, ఆమె సోదరుడు భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరా మారావు మధ్య విభేదాలు ఏర్పడినట్టు వార్తలు వస్తున్నాయి.

# వినాయక చవితి ఉత్సవాలు ముగిసే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**- కలెక్టర్ మను చౌదరి**





**మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 23, (తెలంగాణ దిశ)** :వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా నిమజ్జనం ముగిసే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం గణేష్ నిమజ్జనం ఏర్పాట్ల తనిఖీలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి లతో కలిసి శామీర్ పేట్ చెరువులో నిమజ్జన ఏర్పాట్లను జిల్లా కలెక్టరు పరిశీలించారు. భక్తులకు ఏలాంటి అసౌర్యం కలుగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. గతంలో జరిగిన నిమజ్జన కార్యక్రమంలో ఎదురైన సమస్యలను అధిగమిస్తూ ఈసారి ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. చెరువు పరిసరాలలో నీటి మట్టం తక్కువగా ఉన్నందున నీటి మట్టం ఎక్కువగా ఉన్న మధ్య భాగంలో నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలన్నారు. విగ్రహాల వాహనాలు వెళ్లేందుకు రహాదారిని పరిశీలించి, వెంటనేరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బి, పోలీసు, విద్యుతు శాఖల అధికారుల సమన్వయంతో పనులు చేపట్టాలన్నారు. రాత్రి పూట కూడా నిమజ్జనం జరుగుతుంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారు అందుకు అవసరమయ్యేలా మసకగా ఉండకుండా వెలుగు ఉండేలా స్తంబాలు, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. అధిక సంఖ్యలో భక్తులకు సరిపడా మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో 3 క్రేన్లు పెట్టడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఈ సారి 4 క్రేన్లు పెట్టమని కలెక్టర్ ఆదేశించారు. చెరువు దగ్గరికి భక్తులు వెళ్లకుండా బారీ గేడింగ్ నిర్మించాలని సూచించారు. క్రేన్ పెట్టడానికి స్పాట్లను ఏర్పాటు చేయాలని, క్రేన్ ల దగ్గర డ్రైవర్లు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడలన్నారు. భక్తులకు త్రాగునీరు, వైద్య సదుపాయం, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా అధికారులందరూ ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో తూంకుంట మున్సిపల్ కమీషన్ జ్యోతి, ఆర్ అండ్ బి అధికారి శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారి, ట్రాపిక్ ఎసిపి వెంకట్ రెడ్డి, విద్యుత్తు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి**





**శేరిలింగంపల్లి, ఆగస్టు 23( తెలంగాణ దిశ):** శేరిలింగంపల్లి నియోజకవర్గ సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, స్థానిక కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ తో కలిసి సుడిగాలి పర్యటన చేసారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. నా దృష్టికి వచ్చిన సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటానని విశ్వేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రామ్ నరేష్ నగర్ అసోసియేషన్ సభ్యులు ఎన్నో సంవత్సరాలుగా ఇల్లు కట్టుకొని, కుటుంబాలను పోషించుకుంటూ జీవనం కొనసాగిస్తున్న నేపథ్యంలో వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటి రిజిస్ట్రేషన్స్ నిలిపివేయడం విడ్డూరం అన్నారు. కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ రానున్న వినాయక చవితిని దృష్టిలో పెట్టుకొని తయారు చేయించిన మట్టి గణేశులను ప్రారంభించారు. అనంతరం రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గం లో ప్రభుత్వ హాయంలో ఇప్పుడు నటువంటి ప్రభుత్వ పాలనలో ప్రజలకు మిగిలింది నిరాశే నని ఎద్దేవ చేసారు. భారతీయ జనతా పార్టీ స్థానిక ఎంపీ సహకారంతో తమ దృష్టికి వచ్చిన సమస్యలపై దృష్టి సాధించి, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయడమే మా ఎజెండా అని, రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని మీడియా ముఖంగా తెలియజేశారు. అంతేకాకుండా పర్యావరణాన్ని కాపాడడం మనందరి బాధ్యత కాబట్టి మట్టి గణపతులను పూజిద్దాం– పర్యావరణాన్ని కాపాడుదాం' అని కార్యకర్తలను కోరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఎప్పుడు ఏ ఎన్నికలు జరిగినా కాషాయ జెండా ఎగరడమే మన అందరి కర్తవ్యం గా భావించి ముందుకు వెళ్లాలనిజిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రవీందర్ రావు, అరుణ్ కుమార్, కృష్ణంరాజు, సునీల్ రెడ్డి, సీతారామరాజు, రాధాకృష్ణ యాదవ్ అంబాదాస్, వీరాచారి, కృష్ణ, శేషయ్య, బాలాజీ, నర్సింగ్ యాదవ్, నరసింహ చారి, దుర్గాప్రసాద్, గోపాల్ రావు, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# బాల్యం నుండే భావి ఛాంపియన్లను గుర్తించాలి

**- పసిప్రాయం నుండే క్రీడా ఆసక్తి కలిగించాలి**

**- జాతీయ క్రీడా ఉత్సవాలను ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి**

**- నేటి నుంచి తొమ్మిది రోజులపాటు జాతీయ క్రీడా దినోత్సవాలు**





**హైదరాబాద్, ఆగస్టు 23, (తెలంగాణ దిశ)** :పసిప్రాయం నుండే పిల్లల్లో క్రీడల పట్ల ఆసక్తి కలిగించే విధంగా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాటికి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం నుంచి తొమ్మిది రోజులపాటు జరిగనున్న జాతీయ క్రీడ ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుండే విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి కలిగించడం వారిని మైదానాల వైపు ప్రోత్సహించడం కుటుంబాలకు మాత్రమే కాకుండా దేశానికి సమాజానికి ఎంతో శ్రేయస్కరమని ఆయన అన్నారు. మొక్కై వంగనిది మానై వంగదు అనే సామెత మాదిరిగా పసిప్రాయం నుండే క్రీడల్లో పట్ల శిక్షణ పొందిన విద్యార్థులు క్రీడల్లో విజయాలు సాధించడమే కాకుండా ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దబడతారని ఆయన అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో దేశంలో ఏ రాష్ట్రంలో నిర్వహించనంత ఘనంగా జాతీయ క్రీడ ఉత్సవాలను నిర్వహించ బోతున్నామని అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఒక్క రోజుకే పరిమితం చేయకుండా తొమ్మిది రోజుల పాటు వివిధ వర్గాలను క్రీడల్లో భాగస్వామ్యం చేసే విధంగా అన్ని వయసుల వారికి వర్గాల వారికి వినూత్న కార్యక్రమాలు రూపొందించామని ఆయన అన్నారు. కేవలం హైదరాబాద్ నగరానికే కాకుండా జిల్లా కేంద్రాల్లో వివిధ విద్యాసంస్థల్లో ఈ క్రీడా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి రవీందర్, అనిత, పిఆర్ఓ కాలేరు సురేష్, స్టేడియం అడ్మినిస్ట్రేటర్ మధు, ఫ్యూచర్ ఓలంపియన్ నిర్వాహకులు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

**- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**





**ఏఎస్ రావునగర్, ఆగస్టు 23, (తెలంగాణ దిశ)** :వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. శనివారం కాప్రా సర్కిల్ డిప్యూటీ కమీషనర్ జగన్ అధ్యక్షతన గణేష్ నిమర్జనోత్సవ కార్యక్రమంలో తీసుకోవలసిన జాగ్రత్తలు తలెత్తబోయే సమస్యలు, చేయవలసిన ఏర్పాట్ల విషయమై జరిగిన సమావేశానికి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో బిల్డింగ్ లో జిహెచ్ఎంసి, లా అండ్ ఆర్డర్ పోలీస్, ట్రాఫిక్ పోలీస్, ఆర్ అండ్ బి, ఆరోగ్య శాఖ, విద్యుత్ శాఖ ఉద్యోగులు, గణేష్ ఉత్సవ కమిటీ, వివిధ కాలనీల అసోసియేషన్ వారిచే సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు సలహాలు సూచనలు స్వీకరించారు. సమస్యలను పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో పాల్గొన్న భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ఇతర సభ్యులు, 14 రోజులు జరిగే గణేష్ నిమర్జన కార్యక్రమం కాప్రా చెరువు, చర్లపల్లి చెరువు ప్రాంతాల్లో నిమర్జనం ఏర్పాట్లు, హైటెన్షన్ రోడ్లలో గుంతలు లేకుండా పూడ్చడం, పనులు త్వరగా పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవలసిందిగా అందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని తెలియజేశారు. ఏఎస్ రావునగర్ కార్పొరేటర్ శిరీష సోమశేఖర్ రెడ్డి, మీర్ పేట్ కార్పొరేటర్ ప్రభుదాస్, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ శ్రీదేవి, కాప్రా సర్కిల్ ఈఈ నాగేందర్, కుషాయిగూడ ఏసీపీ వెంకట్ రెడ్డి, సిఐ భాస్కర్ రెడ్డి, డిజీఎం సతీష్ కుమార్, ట్రాఫిక్ సిఐ రాజు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**- కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి**



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 23, (తెలంగాణ దిశ)** :అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతున్న పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన చెక్కులను కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి శనివారం లబ్ధిదారులకు అందించారు. జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చెక్కులను మంజూరు చేయించినట్లు ఆమె తెలిపారు. బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈ చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందించారు. సూరారంకళావతి నగర్ వాసి ఎస్. మణెమ్మకు రూ. 52,500, ఐడిపిఎల్ కాలనీ గురుమూర్తి నగర్ వాసి మహమ్మద్ ఇషాక్ అహ్మద్ కు 60 వేలు, బాచుపల్లి వాసి సరస్వతికి రూ. 60 వేలు చెక్కులను (ఎల్ఓసి) లను లబ్ధిదారులకు అందించారు.

ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అర్హులైన పేదలు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సలు, శస్త్ర చికిత్సలకు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బౌదురుపల్లి మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, టిపిసిసి లేబర్ సెల్ రాష్ట్ర కార్యదర్శి శరగడం నర్సింగరావు, సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షుడు సోమన్న గారి శ్రీధర్ రెడ్డి, సంతోష్ ముదిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బిక్షపతి, చందు, రహీం, హలీం, సురేందర్ రెడ్డి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ మృతి



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 23, (తెలంగాణ దిశ)** :అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం జగద్గిరిగుట్టలో నివసించే గద్దెన్న నగేష్ (35) వృత్తిరీత్యా ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. శనివారం ఉదయం సుమారు 9 గంటల ప్రాంతంలో అతను స్థానిక పైపులైన్ రోడ్డులో ప్యాసింజర్ ఆటోలో చనిపోయి శవమై కనిపించాడు. పెట్రోలింగ్ పోలీసులు సమాచారం అందుకొని వెళ్లి చూడగా నగేష్ మృతదేహం ఆటోలో కనిపించింది. దీంతో మృతుడి తల్లి గడ్డన్న నాగమ్మ కు పోలీసులు సమాచారం అందించి సంఘటన స్థలానికి పిలిపించి మృతదేహాన్ని గుర్తించే ప్రక్రియను పూర్తి చేశారు. అయితే శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2 గంటల ప్రాంతంలో ఆటో రిపేర్ చేయించుకుని వస్తానంటూ 1200 రూపాయలు తీసుకొని ఇంటి నుండి బయలుదేరిన నగేష్ శనివారం ఉదయం శవమై కనిపించాడు. మృతుడి భార్య నాలుగు సంవత్సరాల క్రితం ఆత్మహత్య చేసుకుని చనిపోయింది. మృతుడు నగేష్, అతని ముగ్గురు పిల్లలు నగేష్ అత్తమామల దగ్గరే ఉంటున్నారని మృతుడి తల్లి జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించింది. తన కుమారుడి చావుకు నగేష్ అత్త మామ వారి బంధువులే కారకులని మృతుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నగేష్ మృతదేహంపై కొన్ని గాయాలు ఉండడం, నాలుక బయటికి వచ్చి ఉండడం, పెదవులపై రక్తపు మరకలు ఉండడంతో ఇది హత్యనా..? లేక ఆత్మహత్య నా...? అనే కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఆకాశ్ లే అవుట్ లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి**





**కుత్బుల్లాపూర్, ఆగస్టు 23, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్ పరిధిలోని ఆకాశ్ లే అవుట్ లో సీసీ పనులకు కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కాలనీలో రోడ్డు పూర్తిగా పాడవ్వ టంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతూ హన్మంత్ రెడ్డిని సంప్రదించారు. దీంతో స్పెషల్ ఫండ్స్ ద్వారా సీసీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎన్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శామీర్ పేట్ ప్రకాష్ రావు, రేవంత్ రెడ్డి, బ్రహ్మ రెడ్డి, హరి వర్ధన్, కాలనీవాసులు అజిత్ రామారావు, రామకృష్ణ, సత్య వంశీకృష్ణ, సుబ్బారెడ్డి, వెంకట్ రెడ్డి, మణిద్వీప్, వెంకట్, సంజీవరెడ్డి, అంజాద్, నర్సింగరావు, ఆదిరెడ్డి, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వాసవి మిత్ర మండలి ఆధ్వర్యంలో అమావాస్య అన్న ప్రసాద వితరణ





**ఏఎస్ రావునగర్, ఆగస్టు 23 : (తెలంగాణ దిశ)** :వాసవి మిత్ర మండలి మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో అమావాస్య అన్న ప్రసాద వితరణ చేశారు. కుషాయిగూడ ఏసీపీ వై. వెంకట్ రెడ్డి, సిఐ ఎల్. భాస్కర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అన్న ప్రసాద వికరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కుషాయిగూడ కు చెందిన నలుగురు పేద వృద్ధురాళ్లు మాలే వరమ్మ, కొండూరి విజయ, తోడుపునూరి ఉమారాణి, పండకంటి కమలమ్మలకు రూ. వెయ్యి చొప్పున పెన్షన్లు అందజేశారు. ఈ కార్యక్రమం లో అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్త, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త, కోశాధికారి రాముని తిరు మల్లేష్ గుప్తా, కార్యనిర్వహక కార్యదర్శి గంప కృష్ణ గుప్తా, ఉపాధ్యక్షులు నంగునూరి అశోక్ గుప్త, తాటి శ్రీనివాస్ గుప్త, వైవియు నాగేశ్వర్ గుప్త, కార్యదర్శులు బాచెల్లి నవీన్ గుప్త, అమర కృష్ణ గుప్తా, బల్లి శ్రీధర్ గుప్త, చందా సంతోష్ గుప్త, కార్యవర్గ సభ్యులు ఉప్పల ఆంజనేయులు గుప్త, మిర్యాల అరుణ్ కుమార్ గుప్త, ఏనిశెట్టి రమేష్ గుప్త, సభ్యులు ఉప్పల శ్రీనివాస్ గుప్త, పెద్ది శ్రీనివాస్ గుప్త, నీలా శివకుమార్ గుప్త, కొకలా కృష్ణమూర్తి గుప్త, రాజూరి జగదీష్ గుప్త, అర్థం శ్రీనివాస్ గుప్త, కోదూరి లక్ష్మణ్ గుప్త, వివివి. కృష్ణ గుప్త, బుస్స శ్రీనివాస్ గుప్త, రవ్వ ఈశ్వరరావు గుప్త, బెలిదే భగవాన్ గుప్త, దిడిగం కైలాసం గుప్త, గందె మల్లేష్ గుప్త, కూరపాటి పవన్ కుమార్ గుప్త, ఉగ్గ శ్రీనివాస్ గుప్త, కొండూరి లక్ష్మణ్ గుప్త, రాయికంటి ముత్యాలు పెద్ది నవీన్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మోడీ తర్వాత ఎవరు...?

గడిచిన 11 ఏళ్లలో బీజేపీ దేశంలో గతంలో ఎన్నడూ లేనంతం బలంగా మారింది. దేశంలోని మెజారిటీ రాష్ట్రాల్లో సొంతంగా అధికారంలో ఉంది. మిత్రపక్షాల మద్దతుతో మరికొన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. ఇక కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. మూడోసారి మెజారిటీ రాకపోయినా.. అధికారం మాత్రం చేజిక్కించుకుంది. దీనికి కారణం మోదీ మేనియా.. ఇది ఎవరూ కాదనలేరు. మోదీ కారణంగానే బీజేపీ అనేక రాష్ట్రాల్లో అధికారం చేపట్టింది. కేంద్రంలో వరుసగా మూడుసార్లు అధికారంలోకి వచ్చి రికార్డు సృష్టించింది. అయితే ఆర్ఎస్ఎస్ 75 ఏళ్లు దాటినవారు రాజకీయాల్లో రిటైర్ కావాలంటోంది. మోదీకి సెప్టెంబర్‌తో 75 ఏళ్లు పూర్తికానున్నాయి. ఈనేపథ్యంలో మోదీ తర్వాత ఎవరు అన్న చర్చ దేశవ్యాప్తంగా జరుగుతోంది. 75 ఏళ్లు తప్పనిసరి కాదని బీజేపీ అంటోంది. విపక్షాలు మాత్రం ఆర్ఎస్ఎస్ నిబంధనలు గుర్తు చేస్తున్నాయి. కౌటిల్యుడు చెప్పినట్లు, ఒక వ్యవస్థ బలంగా ఉండాలంటే, ఒక నాయకుడి అనుపస్థితిలోనూ అది సమర్థవంతంగా నడవాలి. ఈ విషయంలో బీజేపీ సిద్ధంగా ఉందా? విపక్షాల్లో మోదీకి సమానమైన నాయకుడు ఉన్నాడా?నరేంద్ర మోదీ దేశవ్యాప్త ఆకర్షణ, రాజకీయ వ్యూహం, జనసామాన్యంతో సంబంధం కలిగి ఉండే సామర్థ్యం వంటి లక్షణాలతో బీజేపీకి తిరుగులేని నాయకుడిగా నిలిచారు. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన నాయకత్వం బీజేపీకి అఖండ విజయాలను అందించింది. అయితే, బీజేపీలో మోదీ స్థాయి నాయకత్వాన్ని అందించగల నేతలు లేరనే వాదన బలంగా వినిపిస్తోంది. అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్, నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్ సింగ్ వంటి నాయకులు ఉన్నప్పటికీ, వారెవరూ మోదీ జాతీయ ఆకర్షణ లేదా ఓటర్లను ఏకతాటిపైకి తీసుకురాగల సామర్థ్యం కలిగి లేరని విశ్లేషకులు భావిస్తున్నారు. అమిత్ షా రాజకీయ వ్యూహకర్తగా బలమైన నాయకుడు, కానీ మోదీ స్థాయి జనాదరణ లేదు. యోగి ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్‌లో బలమైన నాయకుడు, కానీ జాతీయ స్థాయిలో ఆయన ప్రభావం పరిమితం. నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్ సింగ్ సీనియర్ నాయకులైనప్పటికీ, వారు జాతీయ నాయకత్వానికి అవసరమైన ఆకర్షణను ప్రదర్శించలేకపోతున్నారు. మోదీ నాయకత్వం బీజేపీని ఒక వ్యక్తి కేంద్రీకృత పార్టీగా మార్చిందని విమర్శకులు ఆరోపిస్తున్నారు. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబె చెప్పినట్లు, "మోదీ లేకపోతే బీజేపీకి 150 సీట్లు కూడా రావు" అనే వ్యాఖ్య ఈ వాస్తవాన్ని స్పష్టం చేస్తుంది. బీజేపీ సంస్థాగత నిర్మాణం బలంగా ఉన్నప్పటికీ, మోదీ స్థాయి నాయకుడు లేకపోతే ఆ పార్టీ ఓటర్లను ఆకర్షించడంలో సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది. విపక్షాల్లోనూ మోదీకి సమానమైన జాతీయ నాయకుడు కనిపించడం లేదు. కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా ప్రొజెక్ట్ చేస్తున్నప్పటికీ, ఆయనకు కాంగ్రెస్ కూటమిలోనే పూర్తి మద్దతు లేదు. మమతా బెనర్జీ వంటి కీలక నాయకులు రాహుల్‌ను ప్రధాని అభ్యర్థిగా అంగీకరించడానికి విముఖత చూపిస్తున్నారు. రాహుల్ గాంధీ తనను తాను బలమైన నాయకుడిగా నిరూపించుకోవడంలో విఫలమవుతున్నారని విమర్శలు ఉన్నాయి. ఆయన ఆలోచనా విధానం, కుల?మత రాజకీయాలపై దృష్టి సారించడం వంటివి బీజేపీ వ్యూహాలకు ఎదురు నిలవలేకపోతున్నాయి. మోదీ కంటే మెరుగైన పాలన అందిస్తానని నిరూపించడంలో రాహుల్ వెనుకబడి ఉన్నారు. ఇక విపక్షాల్లో ఇతర నాయకుల విషయానికి వస్తే అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ లేదా ఇతర ప్రాంతీయ నాయకులు, జాతీయ స్థాయిలో మోదీకి సవాలు విసిరే స్థాయి ఆకర్షణ లేదా సంస్థాగత మద్దతు కలిగి లేరు. ఈ నేపథ్యంలో, మోదీ రిటైర్మెంట్ తీసుకున్నా, విపక్షాల నుంచి బలమైన ప్రత్యామ్నాయ నాయకత్వం లేకపోవడం దేశ రాజకీయాల్లో నాయకత్వ సంక్షోభాన్ని సూచిస్తోంది. బీజేపీలో 75 ఏళ్ల తర్వాత రిటైర్మెంట్ అనే అప్రకటిత నియమం గతంలో అద్వానీ, ఉమా భారతి, వెంకయ్య నాయుడి వంటి నాయకులపై వర్తింపజేయబడింది. అయితే, ఈ నియమం బీజేపీ రాజ్యాంగంలో లేదు. మోదీ రిటైర్మెంట్‌పై బీజేపీలో ఎటువంటి చర్చ జరగడం లేదు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన "75 ఏళ్లు దాటితే సేవలు చాలు" అనే వ్యాఖ్య విపక్షాల్లో చర్చను రేకెత్తించినప్పటికీ, బీజేపీ నుంచి ఎటువంటి స్పందన రాలేదు. రాజకీయ విశ్లేషకులు మోహిసినా కిద్వాయ్ చెప్పినట్లు, మోదీ స్వయంగా తప్పుకోకపోతే బీజేపీలో నాయకత్వ మార్పు చర్చకు రాదు. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలు, రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో బలమైన నాయకత్వం అవసరమని ప్రజలు భావిస్తున్నారు. ఈ కారణంగా, మోదీ రిటైర్మెంట్ కోరుకునేవారు చాలా తక్కువ. ఎన్డీఏ మిత్రపక్షాలు, ముఖ్యంగా టీడీపీ, మోదీని సరైన సమయంలో ఉన్న సరైన నాయకుడిగా అభివర్ణిస్తున్నాయి. కౌటిల్యుడు చెప్పినట్లు, ఒక సంస్థ బలంగా ఉండాలంటే, ఒక నాయకుడి అనుపస్థితిలోనూ అది సమర్థవంతంగా నడవాలి. మోదీ ఈ విషయంలో విఫలమయ్యారని విమర్శలు ఉన్నాయి. ఆయన తన స్థాయి నాయకత్వాన్ని అందించగల వారసుడిని సిద్ధం చేయలేకపోయారని ఆరోపణలు ఉన్నాయి. బీజేపీలో ఇతర నాయకులు ఎదగకుండా చేయడం లేదా ఆ స్థాయి నాయకత్వాన్ని ప్రోత్సహించకపోవడం వల్ల మోదీ తర్వాత శూన్యత తలెత్తే అవకాశం ఉంది. ఇదే సమస్య విపక్షాల్లోనూ కనిపిస్తోంది, ఎందుకంటే వారు కూడా మోదీకి సమానమైన నాయకుడిని అందించలేకపోతున్నారు. 2029లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, నాయకత్వం ఒక కీలక అంశంగా మారే అవకాశం ఉంది. మోదీ తన రిటైర్మెంట్‌ను ప్రకటించకపోయినా, బీజేపీ తన స్థాయి నాయకత్వా న్ని సిద్ధం చేయడంలో విఫలమైతే, దాని రాజకీయ ఆధిపత్యం ప్రమాదంలో పడవచ్చు.అదే సమయంలో, విపక్షాలు కూడా బలమైన ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని అందించడంలో విఫలమైతే, దేశ రాజకీయాల్లో నాయకత్వ సంక్షోభం తీవ్రమవుతుంది.

## తూతూ మంత్రంగా గణేష్ ఉత్సవ

# కో ఆర్డినేషన్ సమావేశం

### కరువైన సమన్వయం.., అసంతృప్తి వ్యక్తం చేసిన మంటప నిర్వాహకులు

**- అధికారుల తీరుపై విరుచుకుపడ్డ ఉత్సవ సమితి నేతలు**

**- కనీస సమాచారం ఇవ్వని అధికారులు..**



**ఏఎస్ రావునగర్, ఆగస్టు 23 :** గణేష్ ఉత్సవాల కో ఆర్డినేషన్ సమావేశం తూతూ మంత్రంగా కొనసాగింది. అధికారుల తీరుపై అన్ని వర్గాల వారు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కో ఆర్డినేషన్ పేరుతో ఏర్పాటు చేసిన సమావేశంలో సమన్వయం పూర్తిగా కొరవడింది. అధికారులు సమాచారం ఇవ్వడంలో విఫలమయ్యారని ఆరోపణలు వినిపించాయి. కాప్రా సర్కిల్ స్థాయిలో గణేష్ ఉత్సవాల నిర్వహణ కోఆర్డినేషన్ సమావేశాన్ని ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేశారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, బొంతు శ్రీదేవి యాదవ్, ప్రభుదాస్, కాప్రా డిసి జగన్, ఈఈ నాగేందర్, కుషాయిగూడ ఏసీపీ వెంకట్ రెడ్డి, సిఐ భాస్కర్ రెడ్డి, డిజీఎం సతీష్ కుమార్, ట్రాఫిక్ సిఐ రాజు తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో మంటపాల నిర్వాహకులు పలు సమస్యలను ఎత్తిచూపారు. ప్రతి ఏటా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని ధ్వజమెత్తారు. గణేష్ మండపాల అనుమతుల పేరిట అధికారులు వేధిస్తున్నారని విమర్శించారు. గణేశుని ఎత్తు గురించి అధికారులు నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. కనీసం రోడ్లు, వీధిదీపాలు, పారిశుద్ధ్యం, తాగునీరు, చెట్ల పొమ్మలు తొలగించే



విషయంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. నిమజ్జనం సందర్భంగా కాప్రా, చర్లపల్లి చెరువులలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదని విమర్శించారు. సమావేశానికి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు రాకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. గణేష్ పండుగ సమయం దగ్గర పడుతున్న ఈ తరుణంలో సమావేశం ఏర్పాటు చేసి ఏం సాధిద్దామని కోఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేశారని నిలదీశారు. కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తం అయింది. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సైతం డిప్యూటీ కమిషనర్ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా రామంతపూర్ లో ఆరుగురు మృతి చెందిన సంఘటన నేపథ్యంలో కనీసం విద్యుత్ అధికారులు హాజరు కాకపోవడంలో అంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నించారు. మొత్తం మీద అసంతృప్తితో కో ఆర్డినేషన్ సమావేశం ముగిసింది.

## ఏఎస్ రావునగర్ డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

**- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**ఏఎస్‌రావునగర్, ఆగస్టు 23, (తెలంగాణ దిశ):**ఏఎస్ రావునగర్ డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం స్థానిక కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డి గారితో కలిసి ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని సుబ్రమణ్య నగర్‌లో రూ.64 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్డు, వాటర్ డ్రైన్ రూ. 27లక్షలనిధులతో శశికాంత్‌నగర్ లో రూ.13 లక్షల నిధులతో అణుపురంలో రూ. 17.50 లక్షల నిధులతో జపనీస్ టీమ్ ఓపెన్ పార్కులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, జిహెచ్ఎంసి డిఇబాల కృష్ణ, కాసం మహిపాల్ రెడ్డి, పెద్దాపురం కుమార స్వామి, బేతాళ బాలరాజు, రహీం తదితరులు పాల్గొన్నారు.

## చీర్యాల లక్ష్మీ నృసింహ స్వామి వారిని దర్శించుకున్న నవీన్ మిట్టల్



**కీసర, ఆగస్టు 23, (తెలంగాణ దిశ)** :కీసర మండలం శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీ నృసింహ స్వామి వారిని శనివారం తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ విట్టల్ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ వేద పండితులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం అనంతరం స్వామివారి శేష వస్త్రాలు తీర్థ ప్రసాదాల తో ఘనంగా ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ధర్మకర్త శ్రీ హరి పాల్గొన్నారు.

## పాకిస్తాన్‌లో అపారమైన ఖనిజ సంపద

**దీంతో వ్యాపారంచేయాలని పాక్ తహతహ**

**విదేశీ పెట్టుబడుల ఆకర్శణకుప్రత్యేక కార్యాచరణ**

ఇస్లామాబాద్:ప్రస్తుతం పాకిస్తాన్ ఆర్థికంగా దివాలా తీసింది. ఇటీవలి ఆపరేషన్ సిందూర్‌తో మరింతగా పతనం అయ్యింది. సింధూజలాల నిలిపివేతతో దిక్కుతోచకుండా ఉంది. కానీ రానున్న రోజుల్లో మాత్రం ఈ దేశం సూపర్ రిచ్ కానుందని పలు నివేదికలు చెబుతున్నాయి. ఎలాగంటే దాదాపు 3 ట్రిలియన్ నుంచి 5 ట్రిలియన్ విలువైన అరుదైన ఖనిజాలు ఈ దేశంలో దాగి ఉన్నాయని భావిస్తున్నారు. ఇప్పుడు ఈ ఖనిజ సంపదను తవ్వి ప్రపంచ దేశాలతో వ్యాపారం చేయడానికి పాకిస్తాన్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అమెరికా, చైనా, సౌదీ అరేబియా, యూకే, టర్కీ, యూఏఈ లాంటి దేశాలు ఈ అవకాశం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. పాకిస్తాన్‌లో బొగ్గు, రాగి, బంగారం, ఇనుము, క్రోమైట్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఉప్పు గనులు, ఐదో అతిపెద్ద రాగి, బంగారం గనులు ఇక్కడే ఉన్నాయంటా. ఈ ఖనిజాలు బలూచిస్తాన్ భూభాగం నుంచి ఉత్తరాన ఉన్న పర్వత ప్రాంతాలు, పంజాబ్ సారవంతమైన భూములు, సింధ్ భూముల వరకు అన్ని ప్రాంతాల్లో దొరుకుతాయని చెబుతున్నారు. ఇంత సంపద ఉన్నా కూడా ఇప్పటివరకు ఈ గనులను సరిగ్గా వినియోగించలేదు. కానీ, ఇప్పుడు ఈ విషయంలో పెద్ద మార్పు రాబోతోంది. అంతర్జాతీయ పెట్టుబడులను సులభతరం చేయడానికి, ఈ గనుల నిర్వహణను ప్రాంతీయ అధికారం నుంచి కేంద్ర అధికారానికి మార్చాలని పాకిస్తాన్ ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసం రాజ్యాంగ సవరణ అవసరం. దానికి సంబంధించిన చట్టం ఇప్పుడు సమీక్షలో ఉంది. ఈ మార్పు వస్తే, విదేశీ కంపెనీలకు బిడ్డింగ్, రెగ్యులేటరీ అనుమతులు, సెక్యూరిటీ క్లియరెన్స్‌లు సులభంగా జరుగుతాయి. అంటే పెట్టుబడులు వేగంగా రానున్నాయని అంచనా వేస్తున్నారు. నివేదికల ప్రకారం రాబోయే ఆరు నుంచి ఎనిమిది నెలల్లో విదేశీ కంపెనీలతో ఒప్పందాలు ఖరారు కానున్నాయి. గిల్గిట్-బల్టిస్తాన్ ప్రాంతంలో ఖనిజాల తవ్వకం హక్కులు పొందే అవకాశం కోసం చైనా ఎదురు చూస్తోంది. చైనా ఇప్పటికే పాకిస్తాన్‌లో అనేక ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెడుతోంది. ఉత్తర బెలూచిస్తాన్, దక్షిణ ఖైబర్ పఖ్తూన్‌ఖ్వాలో మైనింగ్ ప్రాజెక్టులను అభివృద్ధి చేసే హక్కులు పొందవచ్చని అమెరికా భావిస్తోంది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా పాకిస్తాన్ ఖనిజ, ఇంధన రంగాలపై ఆసక్తి చూపారని తెలుస్తోంది. రేకో డిక్ రాగి-బంగారం గనులపై సౌదీ అరేబియా దృష్టి సారించింది. ఈ గనులు ప్రపంచంలోనే అత్యుత్తమ రాగి, బంగారం నిక్షేపాలలో ఒకటిగా పరిగణించ బడతాయి. సౌదీతో చర్చలు దాదాపు చివరి దశలో ఉన్నాయని అంటున్నారు. పాకిస్తాన్ ఇప్పుడు అమెరికా, యూకే, చైనా, సౌదీ అరేబియా, టర్కీ, యూఏఈ లాంటి దేశాల నుంచి వచ్చే పెట్టుబడిదారులతో డీల్స్ కుదుర్చుకుంటోంది. వీటి కోసం ప్రభుత్వం ఒక సులభమైన వన్-స్టాప్ సొల్యూషన్ సిస్టమ్‌ను తీసుకొస్తోంది. తద్వారా పెట్టుబడిదారులకు అన్ని అనుమతులు, సౌకర్యాలు ఒకే చోట దొరుకుతాయి.

## పాత పెన్షన్ హామీ విస్మరిస్తే పోరాటమే

**పెద్దపల్లి,తెలంగాణ దిశ :** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించే వరకు పోరాటం ఆపేది లేదంటూ పిఆర్ టీ యూ పెద్దపల్లి జిల్లా శాఖ అధ్యక్షులు గండు కృష్ణమూర్తి అన్నారు. 35,40 ఏళ్ళు సేవచేసి పదవి విరమణ పొందిన సీపీఎస్ ఉద్యోగి ఆసరా పెన్షన్ కంటే తక్కువ పెన్షన్ పొందబోతున్నాడని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ ను రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టి అధికారంలోకి రాగానే తాత్సారం చేస్తూ ఉద్యోగుల అత్మాభిమా నం దెబ్బతీస్తే సహించేది లేదని అయన అన్నారు. పీఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర శాఖ రూపొందించి న సిపిఎస్ వ్యతిరేక మహాధర్నా గోడ ప్రతి జిల్లా కేంద్రంలోని పాత మండల రిసోర్స్ సెంటర్ ఆవరణలో జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరిం చారు. సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహదినం సందర్భంగా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఇందిరపార్క్ వద్ద మహాధర్నా కు పెద్దపల్లి జిల్లా నుండి పెద్దసంఖ్యలో సిపిఎస్ ఉద్యోగులు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాలఅధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు మెతుకు తిరుపతి, రాములు, శ్రీరాముల రాజయ్య, దొమ్మటి రాజేందర్, వేగోలపు సత్యనారాయణ, నీలం నరేందర్, శ్రీనివాస్, ప్రతాపరెడ్డి, రాజమౌళి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పొంగిన లక్ష్మాపూర్ ప్రాజెక్ట్

**పరిగి,తెలంగాణ దిశ :** పరిగి నియోజకవర్గ వ్యాప్తంగా కురిసిన భారీ వర్షానికి వాగు వంకలు అన్ని పొంగిపొర్లాయి. మండల పరిధిలోని లక్నా పూర్ ప్రాజెక్ట్ పొంగి ఉధ్ధృతంగా ఉరకలేస్తుంది. బీసీ కాలనీ సాయిరాం కాలనీలో వరద నీరు పెద్ద ఎత్తున ప్రవహించింది. హైవే రోడ్డు పై ముత్తూట్ ఫైనాన్స్ వద్ద, వివేకానంద విగ్రహం వద్ద వరద నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పరిగి నుంచి నస్కల్ మీదుగా వికారాబాద్ వెళ్లే రూట్లో పరిగి పెద్దవాళ్లు ఉధృతంగా ప్రవహించడంతో రెండు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. వాగు ఉధృతి తగ్గే వరకు వాహనదా రులు రోడ్డుపైనే బస్సులోని వారు బస్సులో, కారులోని వారు కారులోనే తమ వాహనాల్లో బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు. పంట పొలాల్లో వరద నీరు పెద్ద ఎత్తున వచ్చి చేరింది.

## శ్రీధర్ బాబు కి అరుదైన గౌరవం దక్కడం సంతోషకరం

**కమాన్ పూర్,తెలంగాణ దిశ :** తెలంగాణ రోల్ మాడల్ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో అహర్నిశలు నిద్రాహారాలు మాని రాష్ట్ర అభివృద్ధికి ఎంతో విచ్చేస్తున్న మన ఐటి శాఖ మత్యులు శ్రీధర్ బాబుకి ఇండియా 100 మోస్ట్ ఇన్ ఫ్లూ యూనియల్ పీపుల్ ఏఐ జాబితాలో చోటు ఎక్కడ ఎంతో గర్వకారణం అని ముత్తారం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ గుప్తా అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు మరియు మంథని నియోజకవర్గ ప్రజలు చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నాము కేవలం రెండు సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లిన మంత్రి శ్రీధర్ బాబు కి కృతజ్ఞతలు ముత్తారం మండలం కాంగ్రెస్ పార్టీ తరఫున తెలియజేస్తూ భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రాన్ని ఉన్నత శిఖరాలకు చేస్తారని ఆశిస్తూ. మా మా నాయకు న్నీ అభివృద్ధి విషయంలో విమర్శిస్తున్న గులాబీ నాయకులకు చెంపపెట్టు అని ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ వివరించారు.

## ప్రతికూలంగానే టోకు ధరల ద్రవ్యోల్బణం



న్యూఢిల్లీ : జులైలో టోకు ధరల ద్రవ్యోల్బణం (డబ్ల్యుపిఐ) వరుసగా రెండవ నెలకూడా (–)0.58 శాతం ప్రతికూలంగానే నమోదైనట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. జూన్‌లో డబ్ల్యుపిఐ (–)0.13 శాతంగా ఉంది. గతేడాది జులైలో ఇది 2.10శాతంగా నమోదైనట్లు తెలిపింది. ఆహార వస్తువులు, మినరల్ ఆయిల్స్, ముడి పెట్రోలియం మరియు సహజవాయువు, ప్రాతమిక లోహాల తయారీ మొదలైన వాటి ధరలు తగ్గడంతో ద్రవ్యోల్బణం ప్రతికూలంగా నమోదైనట్లు పరిశ్రమల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. డబ్ల్యుపిఐ డేటా ప్రకారం.. జులైలో ఆహార వస్తువులకు 6.29శాతం ద్రవ్యోల్బణం నమోదు కాగా, జూన్‌లో 3.75శాతంగా ఉంది. కూరగాయల ధరలు కూడా ఒక్కసారిగా తగ్గాయని పేర్కొంది. జూన్‌లో 22.65శాతంగా ఉన్న కూరగాయల ద్రవ్యోల్బణం జులైలో 28.96శాతంగా ఉంది. తయారీ ఉత్పత్తులకు సంబంధించి జులైలో 0.25శాతంగా ఉండగా, జూన్ నెలలో ఇది 1.97శాతంగా ఉంది. ఇంధనం మరియు విద్యుత్ ద్రవ్యోల్బణం జూన్‌లో 2.65శాతం నుండి జులైలో 2.43శాతం ప్రతికూల ద్రవ్యోల్బణం నమోదైంది. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని పరిగణన లోకి తీసుకున్న రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) ఈ నెల ప్రారంభంలో వడ్డీ రేట్లను 5.5శాతంగానే నిర్ణయించింది. జులైలో రిటైల్ ద్రవ్యోల్బణం ఎనిమిదేళ్ల కనిష్ట స్థాయి 1.55 శాతానికి పడిపోయింది.

## కరీంనగర్ జిల్లా గ్రంధాలయ చైర్మన్ కు సన్మానం

**కమాన్ పూర్,తెలంగాణ దిశ :** కరీంనగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్ పటేల్ రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలోని మంథని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ గారి నివాసానికి వచ్చి మర్యాదపూర్వకంగా కలిశారూ. ఈ సందర్భంగా తిరుపతి యాదవ్ అతిథిని శాలువాతో ఘనంగా సత్కరించి, ఆయన సేవలను అభినందించారు. అనంతరం ఇద్దరూ పార్టీ కార్యకలాపా లు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై స్నేహ పూర్వకంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రొడ్డ బాపన్న, కమాన్పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.ఎస్. అన్వర్, నాగేపెల్లి మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, నాగేపెల్లి మాజీ సర్పంచ్ ఎరుకల బాబురావు, రామయ్యపల్లె మాజీ సర్పంచ్ దేవునూరి రజిత శ్రీనివాస్, పన్నూర్ తాజా మాజీ ఎంపీటీసీ చిందం మహేష్, నరేష్ యాదవ్ పన్నూర్ కాంగ్రెస్ పార్టీ యువ అధ్యక్షు లు ఏరావేనా అజయ్ యాదవ్, రాజాపూర్ కాంగ్రెస్ పార్టీ యువ అధ్యక్షులు కాల్వ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# రిజర్వేషన్లపై తర్జనభర్జనలు

## కిం కర్తవ్యం..

హైదరాబాద్, : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం మల్లగుల్లా లు పడుతున్నది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంది. మరోవైపు ప్రత్యేకంగా తీసుకొచ్చిన ఆర్డినెన్స్ గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది. ఇది లాఉండగా రాజ్యాంగ సవరణ చేయాల్సిన కేంద్ర ప్రభుత్వంలోని బీజేపీ బిల్లుపై కొర్రీలు పెడుతుంటే, రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు, ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తున్నదని ఆరోపణలు గుప్పిస్తు న్నాయి. దీనికితోడు తమకు చట్టబద్ధమైన రిజర్వేషన్లే కావాల ని బీసీలు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సందిగ్ధంలో పడింది. అయితే ప్రస్తుతం ప్రభుత్వం ముందు మూడు మార్గాలు ఉన్నాయి. ఒకటి రిజర్వేషన్‌ను అమలు చేస్తూ ప్రత్యేక జీవోను విడుదల చేయడం. రెండోది స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేయడం.మూడోది పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించడం.ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు. దీనికి తోడు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ నెల 16, 17వ తేదీల్లో పీసీసీ, పీఏసీ సమావేశాలు జరిగే అవకాశం ఉన్నందున బీసీ రిజర్వేషన్ల అంశంపై సుదీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ముందు మూడు మార్గాలున్నప్పటికీ బీసీ రిజర్వేషన్ అంశాన్ని కొలిక్కి తీసుకొచ్చే మార్గంపై తర్జన భర్జన పడుతున్నట్టు తెలుస్తోంది. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో బిల్లు పెట్టింది. ప్రత్యేకంగా ఆర్డినెన్స్ రూపొందించింది. అయితే చివరగా రిజర్వేషన్ల ను అమలు చేస్తూ జీవో విడుదల చేయడమే మిగిలి ఉంది. ఈ క్రమంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ జీవో విడుదల చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తుంది. అయితే గత పదేళ్లలో దా దాపు 8 రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి నిర్ణయా లు జరిగాయి.కానీ వాటిని కోర్టులు కొట్టివేయడమో లేక స్టే ఇవ్వడమో జరిగింది. అయి తే బీసీ రిజర్వేషన్ అంశాన్ని షెడ్యూల్ 9లో చేర్చితేనే కోర్టుల్లో వేసే సవాళ్లను వంద శాతం ఎదుర్కొని బీసీల రిజర్వేషన్ అంశం నిలుస్తుందని బీసీ మేధావులు చెబుతున్నారు. దీనికి తోడు షెడ్యూల్ 9లో చేర్చినా కోర్టులో సమిక్ష చేయవచ్చనే వాదన కూడా వినపడుతున్నది. రిజర్వేషన్‌కు సంబంధించిన అంశాలు రాజ్యాంగ స్వరూపానికి వ్యతిరేకంగా ఉంటేనే కొట్టేస్తామని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై న్యాయపరమైన సమీక్షకు ఆస్కా రం లేకుండా, షెడ్యూల్ 9లో పెడితేనే రిజర్వేషన్లకు రక్షణ ఉంటుందని పలువురు వాదిస్తున్నారు. సెప్టెంబర్ 30వ తేదీలోపు రిజర్వేషన్ అంశం తేల్చాలని, లేని పక్షంలో పాత రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వ హించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం పరిస్థితుల్లో హైకోర్టు నిర్దేశించిన గడువులోగా రిజర్వేషన్ల అంశం కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఎన్నికలను వాయిదా వేయడం ఒక మార్గంగా రాష్ట్ర ప్రభుత్వం భావిస్తు న్నది. అయితే ఎన్నికలను వాయిదా వేస్తే గ్రామా ల్లో పరిపాలన మరింత కష్టంగా మారనున్నది.ఇప్పటికే సర్పంచుల పదవీకాలం ము గిసి ఏడాదిన్నర అవుతుంది. గ్రామ పంచాయతీల్లో పాలక మండలి లేక నిధులు మం జూరు జాప్యం జరుగుతుంది. ఈ క్రమంలో గ్రామాల్లో పాలన సజావుగా సాగడం లేదు. ఈ కారణంగా గ్రామాల అభివృద్ధి కుంటుపడుతున్నది. దీంతో వెంటనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించి గ్రామాలకు నిధులు మంజూరు చేయాలని పెద్దఎత్తున డిమాం డ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదావేసే అవకాశం లేకుండాపోయింది. వాస్తవానికి బీసీ రిజర్వేషన్ల అమలు చేసే ప్రక్రియ మొదలుపెట్టినప్పటి నుంచి కాం గ్రెస్ ప్రభుత్వం పార్టీ పరంగా రిజర్వేషన్ల అం శాన్ని ప్రస్తావిస్తూ వస్తున్నది. రిజర్వేషన్లకు ఎలాంటి అడ్డంకులు తలెత్తినా పార్టీ పరంగానైనా బీసీలకు సీట్లు కేటాయిస్తామని సీ ఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే చాలాసార్లు ప్రకటించారు. కానీ పార్టీ పరంగా ఇచ్చే రిజర్వేషన్లను బీసీలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు. ఆ రకంగా వర్తించే రిజర్వేషన్లతో బీసీలకు నష్ట మే తప్పా లాభం లేదని కుండబద్ధలు కొట్టినట్టు చెబుతున్నారు.పార్టీ పరంగా టిక్కెట్లు ఇచ్చే క్రమంలో బీసీలకు ఓడిపోయే స్థానాలను కట్టబెడతారని ఆరోపిస్తున్నారు. దీంతో పాటు ఒక పార్టీ బీసీకి సీటు ఇచ్చి, వేరొక పార్టీ అగ్రవర్ణాలకు చెందిన అభ్యర్థికి టిక్కెట్టు ఇస్తే, వారిని ఆర్థికంగా, రాజకీయంగా బీసీలు ఎదుర్కో గల రా అని ప్రశ్నిస్తున్నారు. బీసీలతో బీసీలే పో టీ పడాలని డిమాండ్ చేస్తున్నారు. రా జ్యాంగ సవరణ, చట్టబద్ధమైన రిజర్వేషన్లతో మాత్రమే ఇది సాధ్యమవుతుందని వాదిస్తున్నారు.కాంగ్రెస్ పార్టీ నిర్ణయం మంచిదే అయినా బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్ అనివార్యమని స్పష్టం చేస్తున్నారు. బీసీలకు పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చే ఆలోచన ఉన్నప్పటికీ చివరగా జీవో విడుదల చేసే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోంది. న్యాయపరమైన సమస్యలు తలెత్తే క్రమంలో జీవో విడుదల చేసిన వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది.ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత న్యాయస్థానాలు జోక్యం చేసుకోవని భావిస్తున్నది. ఎవ రూ కోర్టుల్లో సవాల్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అనుకుంటున్నది. ఇందులో భాగంగా బీసీ రిజర్వేషన్ల అమలు కోసం వి డుదల చేసే జీవో అంశంపై అన్ని రాజకీయ పార్టీలను సంప్రదించనున్నట్టు సమాచారం.

## ప్రైవేట్ స్కూళ్లలో..

# ఫ్రీ అడ్మిషన్స్

**కర్నూలు,తెలంగాణ దిశ :** విద్యా హక్కు చట్టం కింద ఆంధ్రాలోని ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్ల కేటాయింపు పరిధిని ప్రభుత్వం విస్తరించింది. గతంలో ఒకటో తరగతిలో ఉచిత సీట్లు కేవలం 3 కి.మీ పరిధిలో ఉన్న విద్యార్థులకు మాత్రమే లభించేవి. తాజాగా ప్రభుత్వం ఆ పరిధిని 5 కి.మీ వరకు పెంచింది. దీంతో మరింత మంది పిల్లలు ఉచితంగా చదివే అవకాశం పొందుతున్నారు. ఈ సీట్ల ఖర్చు మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుంది. తల్లిదండ్రులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. మిగిలిన సీట్ల భర్తీ కోసం ప్రభుత్వం మూడో నోటిఫికేషన్ జారీ చేసింది. ఒకటో తరగతిలో 25% సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో ఉన్న కొన్ని షరతులను ఈసారి సడలించారు.సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ లేదా రాష్ట్ర సిలబస్ పాఠశాలల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేయవచ్చు. అనాథ పిల్లలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, హెచ్ఐవీ బాధితులు, మైనారిటీలు, తక్కువ ఆదాయం గల ఓసీ విద్యార్థులకు ఇది మంచి అవకాశం. సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఐబీ పాఠశాలల్లో చేరాలనుకుంటే.. పుట్టిన తేదీ 2019 ఏప్రిల్ 2 నుంచి 2020 మార్చి 31 మధ్యలో ఉండాలి. రాష్ట్ర సిలబస్ పాఠశాలల్లో చేరాలనుకుంటే.. బర్త్ డేట్ 2019 జూన్ 2 నుంచి 2020 మే 31 మధ్యలో ఉండాలి. బలహీన వర్గాల బీసీ, మైనారిటీ, ఓసీ గ్రామీణ ప్రాంతాల కుటుంబాల వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలకు మించకూడదు. పట్టణ ప్రాంతాల్లో అయితే రూ.1.44 లక్షలకు దాటకూడదు.పాఠశాల ఎంపిక కోసం సచివాలయం, ఎంఈవో ఆఫీసు, మీ సేవ కేంద్రాలు లేదా ఇంటర్నెట్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు. మొదట ఒక కి.మీ పరిధిలో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, ఆ తర్వాత 5 కి.మీ పరిధిలో ఉన్న దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటారు. ఎంపికైన విద్యార్థుల పేర్లు ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు. తల్లిదండ్రుల ఆధార్ / ఓటరు ఐడీ / రేషన్ కార్డు లేదా ఇతర చిరునామా రుజువు పత్రాలు కావాల్సి ఉంటుంది. పిల్లల జనన ధృవీకరణ పత్రం కూడా ఉండాలి. దరఖాస్తులను ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు.. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

# బాలరాజు బాటలో అబ్రహాం..!

**మహబూబ్ నగర్,తెలంగాణ దిశ :** తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో ఉన్న అలంపూర్ నియోజకవర్గం ఎప్పుడు రాజకీయ మ లుపులో ప్రత్యేకతను చాటుకుం టూనే వస్తుంది. మాజీ ఎమ్మెల్యే అబ్రహం ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ తన అ నుచరవర్గం మాత్రం బిజెపివైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు బిజెపి దక్షిణాది రాష్ట్రాల్లో తన వశం చేసుకోవాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్ళుతు ఆంధ్రప్రదేశ్లో ఇప్పటికే పొత్తులో భాగంగా అధికారంలోకి రాగా తెలంగాణ రాజకీయా ల వైపు పాగా వేయాలని అడుగులు వే స్తుంది. టిఆర్ఎస్ పార్టీలో పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓడిపోయిన వారితోపాటు కాంగ్రెస్ లో ఉన్న అసంతృప్తి నాయకులను ఆకర్షించేందుకు పావులను కదుపుతుంది. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వ ల బాలరాజు ఇప్పటికే బి ఆర్ఎస్ పార్టీని వీడి బిజెపి పార్టీలోకి చేరగా గద్వాల జిల్లా అలం పూర్ నియోజకవర్గంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొంది తన ప్రజా బలాన్ని ఆకర్షించే నేతగా అబ్రహం ఏదిగారు. గత ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ నుండి టికెట్ ని ఆశించి తీవ్రంగా శ్రమించిన ఆయనకు విజేయుడు రూపంలో అదృష్టం చేజారింది. నువ్వా నేనా అంటూ ఉద్రిక్త భరితంగా చివరి వరకు టికెట్ వస్తుందని ఆశించిన ఆయనకు చల్లా వెంకట్రామిరెడ్డి ఆశీస్సు లు కోల్పోయి టికెట్టు దగ్గకపోవడంతో ఆ యన భంగపడ్డారు. దీంతో వెంటనే తనని కాదని పార్టీ టికెట్ ఇచ్చిన విజేయుడు ను ఓ డించేందుకు ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎ మ్మెల్యే సంపత్ కుమార్ గెలుపు కోసం చే తులు కలిపి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో స్వల్ప మెజా ర్టీతో ఓడిన సంపత్ కుమార్ వద్ద క్రమంగా ప్రత్యక్ష రాజకీయాలకు ఆయన దూరంగా ఉంటున్నారు. క్రమంగా పార్టీ కార్యక్రమాలు సభలు సమావేశంలో హాజరు కావడం లేద ని ప్రచారం లో ఉంది. తన రాజకీయ జీవితంలో తన వారసుడు మమకమై తన వెను క ఉండి చూసుకున్న తన కొడుకును తన రా జకీయ వారసుడిగా ప్రజలకు పరిచయం చే యాలనుకున్న తరుణంలో బి ఆర్ ఎస్ పార్టీ తనకు టికెట్ ఇవ్వకపోవడంతో తన కొడుకు రాజకీయ జీవితం ఎలాగైనా చక్క పెట్టాలన్న ఆలోచనతో బిజెపిలోకి అడుగులు పెట్టేందు కు యోచిస్తున్నట్లు తన సన్నిత వర్గాల ద్వా రా తెలిసింది.ఇప్పటికే బిజెపి ముఖ్య నాయకులతో సంప్రదింపులు జరిగినట్లు ప్రచార సైతం జోరుగా వినిపిస్తోంది. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బిజెపిలోకి అడుగుపెట్టిన వెంటనే సాధ్య అసా ధ్యాలపై పరిస్థితులను అంచనా వేసి ముం దుకు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు స్పష్టమవుతుంది. పరోపక్క తను పార్టీ మారుతున్నట్లు లీకులు ఇచ్చిన వెంటనే తనను కాంగ్రెస్ పా ర్టీ బుజ్జగిస్తుందా అన్న ఆశతో కూడా ఉన్నట్లు తెలుస్తోంది. కాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తనకుమారుడికి క్రియాశీల పదవి ఇస్తారని ఆశతో ఉన్నట్టు ప్రచారం జోరుగా వినిపిస్తుంది.

పేదల డాక్టర్‌గా, వివాదరహితుడిగా ఉన్న డాక్టర్ అబ్రహం2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2018లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో అబ్రహం అనుచరులు, అభిమానులు రాజకీయంగా తగిన నిర్ణయం తీసుకోవాలని అబ్రహంపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. పలు మండ లాల నాయకులు మంతనాలు చేస్తుండ డంతో వేచి చూద్దాం అన్న ధోరణిలో

మాజీ ఎమ్మెల్యే ఉన్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో నడిగడ్డకు చెందిన బీజేపీ ముఖ్య నేతలు రంగంలోకి దిగి అబ్రహంను బీజేపీలోకి రావలసిందిగా ఆహ్వానించినట్లు తెలుస్తోంది.

# ఆశా కార్యకర్తలకు గుడ్ న్యూస్

**ఏలూరు,తెలంగాణ దిశ :** ఆశా కార్యకర్తలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీపికబురు వినిపించింది. ఆశా కార్యకర్తలకు 180 రోజులు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని నిర్ణయించింది. మొదటి రెండు ప్రసవా లకు ఇది వర్తించనుంది. అలాగే గ్రాట్యుటీ కింద రూ.1.50 లక్షలు వరకూ ఇవ్వాలని నిర్ణయించింది. ఆశా కార్యకర్త పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. మార్చి నెలలో ఆరోగ్యశాఖపై జరిగిన సమీక్షలో సీఎం చంద్రబాబు ఈ మూడు నిర్ణయాలకు ఆమోదం తెలపగా.. ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.ఆగస్ట్ 15 సందర్భంగా ఆశా కార్యకర్తలకు ఏకంగా మూడు శుభవార్తలు చెప్పింది. ఆశా కార్యకర్తల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను తాజాగా జారీ చేశారు. ఆశా కార్యకర్తల ప్రసూతి సెలవుల విషయంలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆశా కార్యకర్తలు అందరికీ మొదటి రెండు ప్రసవాల కోసం 180 రోజులు పూర్తి జీతంతో ప్రసూతి సెలవులు ఇవ్వాలని నిర్ణయించింది. అలాగే ఆశా వర్కర్ల పదవీ విరమణ వయసును 62 ఏళ్లుగా నిర్ణయించారు. వీటితో పాటుగా ఆశా కార్యకర్తల గ్రాట్యూటీ విషయంలోనూ ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సర్వీస్ పూర్తైన ఆశా కార్యకర్తలకు గ్రాట్యుటీ సంవత్సరానికి నెలవారీ గౌరవ వేతనంలో 50 శాతం అంటే 5,000 చెల్లిస్తారు..గరిష్టంగా మొత్తం రూ.1,50,000 వరకు ఇస్తారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఎం.టీ. కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు.మరోవైపు 2024 ఏపీ ఎన్నికల సందర్భంగా ఆశా కార్యకర్తలకు మిగతా ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అలాగే గ్రాట్యుటీ, ఉద్యోగ విరమణ వయసు పెంపుపైనా వారికి హామీలు ఇచ్చారు.ఈ నేపథ్యంలో ఈ ఏడాది మార్చి నెలలో ఆరోగ్య



శాఖపై జరిగిన సమీక్షా సమావేశంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు వీటిపై నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సుమారుగా 42,752 మంది ఆశా వర్కర్లు పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 37 వేల మంది ఆశాకార్యకర్తలు పనిచేస్తూఉంటే.. పట్టణ ప్రాంతాల్లో 5,735 మంది ప్రజలకు సేవలందిస్తున్నారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో ఆశా కార్యకర్తలదే కీలక పాత్రఅయితే ప్రజారోగ్య సంరక్షణలో కీలకంగా ఉండే ఆశా వర్కర్లకు ప్రభుత్వం ప్రతినెలా రూ.10000 చొప్పున వేతనం అందిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ప్రభుత్వం అందించే గౌరవ వేతనాలు తప్ప వారికి అదనపు ఆర్థిక ప్రయోజనాలు లేవు.

ఈ నేపథ్యంలోనే ఆశా కార్యకర్తగా 30 ఏళ్లపాటు సేవలు అందించిన వారికి గ్రాట్యుటీ కింద రూ.1.50 లక్షలు వరకూ చెల్లించేందుకు మార్చి నెలలోనే సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు.అలాగే ఆశా కార్యకర్తలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. తొలి కాన్పు సమయంలో మూడు నెలలు, రెండో కాన్పు సమయంలో మరో మూడు నెలలు వేతనంతో కూడిన ప్రసూతి సెలువులు ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు. ఇక ఆశా వర్కర్ల ఉద్యోగ విరమణ వయసును కూడా 60 సంవత్సరాల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ అప్పట్లో నిర్ణయించారు.

# 17 తర్వాత డీఎస్సీ సర్టిఫికెట్లు





**నెల్లూరు,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ ఫలితాలు విడుదలయ్యాయి. క్వాలిఫై అయిన అభ్యర్థులు తమ స్టాటస్ ఏంటో? జిల్లాలో, జోన్‌లో తామ ర్యాంకు ఎంతో ఉద్యోగం వస్తుందో రాదో అన్న చర్చ నడుస్తోంది. జిల్లా ఆయా సబ్జెక్టుల్లో టాప్ మార్కులు ఎన్ని కటాఫ్ ఎంత ఉండొచ్చు అనే వివరాలపై ఆరా తీస్తున్నారు. స్కోర్ కార్డును అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టిన అధికారులు మరో రెండు రోజుల్లో మెరిట్ లిస్ట్ విడుదల చేసేందుకు అవకాశం ఉంది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఎప్పటి నుంచి ఉంటుందో అనే విషయాలపై చర్చించుకుంటున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ అనేది జిల్లా స్థాయి, జోన్ స్థాయి అభ్యర్థుల కోసం నిర్వహించే పరీక్ష. ఉద్యోగాల నియామకం జిల్లాల వారీగా, జోన్‌ల వారీగా భర్తీ చేస్తారు. ఇదే విషయం నోటిఫికేషన్ టైంలోనే వెల్లడించారు. ఏ జిల్లాకు ఏ సబ్జెక్ట్ ఎన్ని ఉద్యోగాలు ఉన్నాయ. ఏ జోన్‌లో ఎన్ని ఉద్యోగాలు ఉన్నాయో స్పష్టంగా తెలియజేశారు. ఏ కేటగిరికి ఎన్ని ఉద్యోగాలు వస్తున్నాయి. నాన్ లోకల్ అభ్యర్థులకు ఎన్ని ఉద్యోగాలు ఇస్తారో కూడా ముందే లెక్కలు వేసి చెప్పేశారు.సాధారణంగా పరీక్ష తర్వాత జరిగే ప్రక్రియ నోటిఫికేషన్ టైంలోనే జరిగిపోయినందున మెరిట్ జాబితా తయారు చేయడం పెద్ద సమస్యగా ఉండదు. న్యాయపరమైన చిక్కులు కూడా ఉండేందుకు అవకాశమే లేదు. కాబట్టి జిల్లా స్థాయి అధికారులు ఈ పని మీదే ఉన్నారు.టెట్ మార్కుల్లో మార్పులు చేర్పులకు అవకాశం ఇచ్చారు. ఇలా చేయడం ఇదే తొలిసారి. చాలా మంది టెట్ మార్కులు తప్పుగా వేశారని గుర్తించిన అధికారులు స్కోర్ కార్డు ప్రకటించిన తర్వాత కూడా టెట్ మార్కులు సవరణకు అవకాశం ఇచ్చారు. దీని కారణంగా ఫైనల్ స్కోర్‌లో మార్పులు జరగొచ్చు.ఇప్పుడు టెట్‌లో క్వాలిఫై కాని అభ్యర్థులు కూడా టెట్ క్వాలిఫై అయినట్టు చెప్పుకొని పరీక్షలు రాశారు. కొందరు తప్పుగా మార్కులు నమోదు చేశారు. వీళ్లందరికి మరో అవకాశం ఇచ్చేందుకు టెట్ మార్కులు ఎడిట్ ఆప్షన్ ఇచ్చారుతప్పులు సవరించుకోవడానికి గడువు ఇచ్చినందుకున ఆ తర్వాతే మెరిట్ లిస్ట్‌ను తయారు చేస్తారు. తప్పులు కరెక్షన్ చేసిన తర్వాత జిల్లా, జోనల్ స్థాయి మెరిట్ జాబితాను సిద్ధం చేస్తారు. అనంతరం వాటిని వెబ్‌సైట్‌లో పెట్టనున్నారు. అనంతరం ఆగస్టు 17 తర్వాత సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు సమయం కేటాయిస్తారు.సర్టిఫికెట్ వెరిఫికేషన్ అయిన తర్వాత ఉద్యోగాలు వచ్చిన వారి పూర్తి జాబితాను అధికారులు వెబ్‌సైట్ లో పెట్టనున్నారు. అలా ఫైనల్ లిస్ట్‌లో పేర్లు ఉన్న వాళ్లు కౌన్సెలింగ్ నిర్వహించి స్కూల్స్ ఎంచుకునే అవకాశం కల్పిస్తారు. ఆ ప్రక్రియ పూర్తి అయన తర్వాత వాళ్లకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వనున్నారు. ఇది ఆగస్టు చివరి వారాంతానికి పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ముందుగా 17 నాటికి అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇస్తామని అన్నారు కానీ అది ఇప్పుడు సాధ్యమయ్యేలా కనిపించడం లేదు.

# ఆదోని సర్కారీ స్కూల్ నో అడ్మిషన్!

**కర్నూలు,తెలంగాణ దిశ:**రాష్ట్ర విద్యా వ్యవస్థలో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులతో రాష్ట్రంలో ప్రభుత్వ స్కూల్‌లలో అడ్మిషన్‌ను పెరుగుతున్నాయి. ఈ క్రమంలోనే కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియ ల్ పురపాలక ఉన్నత పాఠశాలకు బడి తెరిచిన నాటి నుంచి ప్రతి రోజు సిఫారసు లేఖలతో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను బడిలో చేర్చుకోవాలని క్యూ కడుతున్నారు. ఇప్పటికే 6 నుంచి పదో తరగతి వరకు పాఠశాలలో 1,725 మంది విద్యార్థులు ఉన్నారు. ఒక్కో గదిలో 120 మందికి పైగా విద్యార్థులు కూర్చుంటు న్నారు.ఈ నేపథ్యంలో స్కూల్‌లో విద్యార్థులకు చోటు చాలక పోవడం తో స్కూల్ బయటన నో అడ్మిషన్ బోర్డు పెట్టారు.కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో సమూలమైన మార్పులు చేసి సన్న బియ్యంతో విద్యార్థులకు భోజనం వడ్డించడం తల్లికి వందనం కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్న అంతమందికి రూ.15 వేలు జమ చేయడం తో ప్రభుత్వ పాఠశాలలకు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఆ పాఠశాలకు ఏటా పదవ తరగతి ఉత్తీర్ణత శాతం పెరుగుతుండడం ఉపాధ్యాయులు, క్రమశిక్షణతో బోధన చేస్తుండడం, ఔఅఅ , క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుండడంతో తల్లిదండ్రులు ఆ పాఠశాలలో చేర్చేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు.రాష్ట్రంలో అత్యధికంగా విద్యార్థులు చదువుతున్న పురపాలక పాఠశాలల్లో ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులు చదువుతున్నారు. 2025- 26 విద్యా సంవత్సరా నికి 450 పైగా అడ్మిషన్లు చేసుకున్నారు. ఒక్క ఆరో తరగతి లోని 298 పైగా అడ్మిషన్లు అయ్యాయి. ఒక్కో తరగతి గదిలో 120 మందికి పైగా విద్యార్థులు కూర్చుంటున్నారు. తరగతి గదిలో కూర్చోడానికి కూడా స్థలం లేక కొంతమంది నేలపైనే కూర్చొని పాటలు వింటున్నారుఅయితే నెహ్రూ మెమోరియల్ హైస్కూల్లో నో అడ్మిషన్ల బోర్డులు పెట్టడంపై రాష్ట్ర విద్యాశాఖ

మంత్రి లోకేష్ స్పందించారు. 1725 మంది విద్యార్థులున్న ఈ హైస్కూలులో ఈ ఏడాది అన్ని తరగతుల్లో 400 మందికి పైగా కొత్త విద్యార్థులు చేరడం ప్రభుత్వ విద్య పట్ల ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని ఆయన అన్నారు.‘నో అడ్మిషన్ బోర్డు పెట్టి, అడ్మిషన్స్ క్లోజ్ చేశామని తల్లిదండ్రులకు నచ్చజెపుతున్నా, మా పిల్లాడి ఒక్కడిని చేర్చుకోండి సార్‘ అని బతిమాలుతుంటే కాదనలేకపోతున్నామని చెబుతున్న హెడ్మాస్టర్ ఫయాజుద్దీన్, టీచర్లు, సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు అంటూ మంత్రి ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. రాష్ట్రంలోని ప్రతి స్కూలులో ఇలాగే నో అడ్మిషన్ బోర్డులు కనిపించాలని.. తల్లిదండ్రుల్లో ప్రభుత్వ విద్య పట్ల నమ్మకం కల్పించిన ఉపాధ్యాయులే ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ తీర్చిదిద్దే రథసారథులు అని ఆయన అన్నారు

# తెలంగాణ కాంగ్రెస్ లో ముసలం



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** టీ కాంగ్రెస్‌లో మళ్లీ ముసలం మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల టైంలో అంతా కలిసి పనిచేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. దీంతో ఇక ఇప్పుడు పదవుల లొల్లి మొదలైంది. ఏడాదిన్నర తర్వాత మంత్రివర్గ విస్తరణ లొల్లికి మరింత ఆజ్యం పోసింది. మంత్రి పదవి ఆశించి భంగపడ్డ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీకి తలనొప్పిగా మారారు. తనకు మంత్రి పదవి ఇవ్వకపోవడంపై చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారాయి. పార్టీ అధిష్ఠానం ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోవడంతోపాటు, రాష్ట్ర నాయకత్వం తనను అవమానిస్తోందని ఆయన ఆరోపిస్తూ, పలు సందర్భాల్లో పరోక్షంగా, ప్రత్యక్షంగా తన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదం తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత కలహాలను మరింత తీవ్రతరం చేస్తోంది. రాజగోపాల్ రెడ్డి బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సమయంలో పార్టీ అధిష్ఠానం తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన పదేపదే ప్రస్తావిస్తున్నారు. భువనగిరి ఎంపీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడంతోపాటు, మునుగోడు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తాను కీలక పాత్ర పోషించినా, హామీ నెరవేరలేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంలో ఆయన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యలను స్వాగతిస్తూ, రాష్ట్ర నాయకత్వం తనకు అడ్డుపడుతోందని ఆరోపిం చారు. ఈ ఆరోపణలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీనియర్ నేత జానారెడ్డి వంటి నాయకులపై పరోక్షంగా చేస్తున్నారు. మరోవైపు ఒకే కుటుంబం నుంచి ఇద్దరికి మంత్రి పదవులు ఇవ్వడంలో తప్పేమిటని ప్రశ్నిస్తున్నారు.రాజగోపాల్ రెడ్డి తాజాగా తన వాదనలో ఖమ్మం, నల్గొండ జిల్లాల మధ్య పోలికను తెరపైకి తెచ్చారు. ఖమ్మం జిల్లాలో 9 మంది ఎమ్మెల్యేలకు ముగ్గురు మంత్రులు ఉండగా, 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న నల్గొండ జిల్లాకు కూడా ముగ్గురు మంత్రులు ఉండటంలో తప్పేమిటని ప్రశ్నిస్తున్నారు. రాజగోపాల్ రెడ్డి తన వ్యాఖ్యలను కేవలం వ్యక్తిగత అసంతృప్తిగా పరిమితం చేయకుండా, మునుగోడు నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి అన్యాయం జరుగుతోందనే కోణంలో మలిచారు. తనకు మంత్రి పదవి ఇవ్వకపోవడం వల్ల మునుగోడు అభివృద్ధికి నిధులు, ప్రాజెక్టులు ఆగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. "మునుగోడు ప్రజలకు అన్యాయం జరిగితే, అది నాకు అన్యాయం జరిగినట్టే" అని ఆయన పేర్కొనడం ద్వారా, తన రాజకీయ లక్ష్యం పదవి కంటే ప్రజల సంక్షేమమేనని స్పష్టం చేశారు.రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీనియర్ నేత జానారెడ్డిపై ఆయన చేసిన విమర్శలు, సోషల్ మీడియా వేదికలపై ఆయన పరోక్ష దాడులు పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారాయి. జానారెడ్డిని "ధృతరాష్ట్రుడు"గా పోల్చడం, రేవంత్ రెడ్డి దీర్ఘకాల సీఎం పదవి వ్యాఖ్యలపై కౌంటర్ ఇవ్వడం వంటివి ఆయన ధోరణిని స్పష్టం చేస్తున్నాయి. అయితే, ఈ విమర్శలు పార్టీ అధిష్ఠానంపై ఒత్తిడి పెంచడంతోపాటు, రాజగోపాల్ రెడ్డి రాజకీయ భవిష్యత్తును కూడా ప్రశ్నార్థకంగా మార్చాయి. పార్టీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి ఆయనతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

హామీ ఇచ్చినప్పుడు తెలియదా: మంత్రి పదవి ఇస్తామన్న హామీపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. 'నన్ను పార్టీలోకి తీసుకున్నప్పుడు తెలియదా మేము ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామని, పార్లమెంట్‌ఎన్నికల సమయంలో రెండోసారి ప్రామిస్ చేసినప్పుడు తెలియదా మేమిద్దరం అన్నదమ్ములం ఉన్నామని.. ఒడ్డు దాటే వరకు ఓడ మల్లయ్య ఒడ్డు దాటాక బోడి మ ల్లయ్య అన్న చందంగా ఉంది. 9 మంది ఎమ్మెల్యేలు ఉన్న ఖమ్మం జి ల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నారు. 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న నల్లగొండ జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండటం తప్పా, ఇద్దరం అన్న దమ్ములం సమర్థులమే, ఇద్దరం గట్టివాళ్లమే, ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి. ఆలస్యమైనా సరే నేను ఓపిక పడుతున్న" అని వ్యాఖ్యానించారు. మంగళవారం మునుగోడు మండలం ఎలగలగూడెంలో గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్సీ సత్యంతోకలిసి ప్రారంభించా రు.మంత్రి పదవి ఇస్తామన్న హామీ ఆలస్యమైంది, సమీకరణాలు కుదరటం లేదని అంటున్నారు, ఎం దుకు కుదరటం లేదని ప్రశ్నించారు. పదవి రాకుండా ఎవరడ్డుకుంటున్నారని నిలదీశారు. మంత్రి పదవిపై మాటిచ్చారు, పదవి ఇచ్చినప్పుడు ఇవ్వండిగానీ వెనకబడిన మునుగోడు నియోజకవర్గం అభివృద్ధికి నిధులు మాత్రం ఆపొద్దని కోరారు. తనకు అన్యాయం జరిగితే పర్వాలేదు కానీ మునుగోడుకు అన్యాయం జరగవద్దన్నారు. మునుగోడు వెనుకబడి ఉందని చెప్పారు. ఏ పదవి ఇచ్చినా మునుగోడు ప్రజల కోసమేకానీ తన కోసం కాదన్నారు.



## జిల్లాను కుష్టు రహిత జిల్లాగా మార్చాలి

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్**

**మహబూబాబాద్,తెలంగాణ దిశ:** కుష్టు వ్యాధిగ్రస్తులకు సంపూర్ణ చికిత్స అంధించి మహబూబాబాద్ జిల్లాను కుష్టు రహిత జిల్లాగా మార్చాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ తెలిపారు. ఐ.డి.ఓ.సి లోని జిల్లావైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యలయం లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న లేప్రసి నోడల్ సూపర్ వైజర్స్ కి కుష్టు వ్యాధికి సంభంధించిన రికార్డుల నిర్వహణ, రిపోర్టింగ్ పై ఏర్పాటు చేసిన సమావేశములో ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ త్వరలో జాతీయ పరిశీలక బృందం జిల్లాను సందర్శించనున్నట్లు సింపుల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ లో ఉన్నటువంటి 7 రికార్డులను సక్రమముగా నిర్వహించాలని తెలిపారు. కుష్టు వ్యాధిగ్రస్తులను ముందుగానే గుర్తించి చికిత్స అందించడం ద్వారా అంగవైకల్యాన్ని నివారించవచ్చునని పేర్కొంటూ, ఆశా కార్యకర్తలు గృహ సందర్శనలో వారి వారి క్షేత్రస్థాయిలో స్పర్శ లేని మచ్చలు గాని, రాగి వర్ణము కలిగిన మచ్చలు గాని ఉంటే అట్టి వ్యక్తులను సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రము వైద్యాధికారికి పంపించి నిర్ధారించాలని ఒకవేళ కేసును గుర్తిస్తే పూర్తి కాలము చికిత్స తీసుకునేటట్లు ఆశా కార్యకర్తలు వారిని ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో లెప్రసి , ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ విజయ్ కుమార్, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాల్య, ఎల్లయ్య, సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ, నోడల్ సుపెర్వైసర్స్ తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంతీర్పుపై కిం కర్తవ్యం

## న్యాయనిపుణులతో చర్చలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** రేవంత్ ముఖ్యమంత్రి అయిన తర్వాత శాసనమండలికి ఎవరిని పంపించాలి చర్చ మొదలైనప్పుడు.. ఆయన మదిలో మిగిలిన తొలి పేరు కోదండరాం.. ఆ తర్వాత ఇతర సమీకరణాల నేపథ్యంలో అలీ ఖాన్ పేరును కూడా ఆయన గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎంపిక చేయడానికి పంపించారు. గవర్నర్ మరో మాటకు తావు లేకుండా వారిద్దరిని శాసనమండలి సభ్యులుగా ఎంపిక చేశారు. అయితే వారిద్దరిని ఎందుకు ఎంపిక చేశారని సవాల్ చేస్తూ అప్పట్లోనే భారత రాష్ట్ర సమితి నేతలు దాసోజు శ్రవణ్, సత్యనారాయణ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సర్వోన్నత న్యాయస్థానం ఇన్ని రోజులపాటు ఆ ఫిర్యాదును హోల్డ్ లో పెట్టింది. దానికి సంబంధించి విచారణ సాగించింది. ఈ విచారణలో భాగంగా ఇరుపక్షాల వాదనలు విన్న సర్వోన్నత న్యాస్థానం కోదండరాం, అలీ ఖాన్ ను ఎమ్మెల్సీలుగా ఎంపిక చేయడం సరి కాదని ధర్మసనం వ్యాఖ్యానించింది. వారి శాసనమండలి సభ్యత్వలను రద్దు చేస్తూ సంచలనమైన తీర్పు ఇచ్చింది. గతంలో శ్రవణ్, సత్యనారాయణ ను గవర్నర్ కూడా లో ఎమ్మెల్సీలుగా ఎంపిక చేయాలని భారత రాష్ట్ర సమితి ప్రతిపాదించింది. దీనిని గవర్నర్ పరిధిలోకి తీసుకెళ్లింది. అయితే గవర్నర్ దీనిని వ్యతిరేకించారు. ఆ తర్వాత ఎమ్మెల్యేల కోటాలో శ్రవణ్ ఎమ్మెల్సీ అయ్యారు. అప్పట్లో గవర్నర్ తనను ఎమ్మెల్సీగా ఎంపిక చేయకపోవడం పట్ల శ్రవణ్ తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాదు కోదండరాం, ఆలీ ఖాన్ ను ఎమ్మెల్సీలుగా ఎంపిక చేయడాన్ని ఆయన తప్పు పట్టారు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇన్ని రోజులపాటు ఆ పిటిషన్ ను హోల్డ్ లో పెట్టిన సుప్రీంకోర్టు.. భారత రాష్ట్ర సమితి ఊహించిన విధంగా తీర్పు ఇచ్చింది. అంతేకాదు తదుపరి విచారణను వచ్చే నెల 17 కు వాయిదా వేస్తున్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించింది. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో నామినేషన్లు తమ తుది తీర్పుకు లోబడి ఉంటాయని సుప్రీంకోర్టు వెల్లడించింది.

ఈ తీర్పు ఒక రకంగా అధికార కాంగ్రెస్ పార్టీకి ఎదురు దెబ్బలాంటిది. ఎందుకంటే 2023లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రావడానికి ప్రధాన కారణాలలో కోదండరాం కూడా ఒకరు. కోదండరాం ఉద్యమ నాయకుడిగా పేరుపొందారు. అయితే ఆయనకు భారత రాష్ట్ర సమితి సముచిత ప్రాధాన్యం ఇవ్వలేదు.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆయన తెలంగాణ ఉద్యమంలో చేసిన సేవలు గుర్తించి ఎమ్మెల్సీగా ఎంపిక చేసింది. ఆయన ఎంపికను ప్రారంభం నుంచి భారత రాష్ట్ర సమితి తప్పుపడుతూనే ఉంది. చివరికి సర్వోన్నత న్యాయస్థానం ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో.. ఏం జరుగుతుందో అనేది ఆసక్తికరంగా మారింది. సెప్టెంబర్ 17న ఈ కేసు కు సంబంధించి తుది తీర్పు వెళ్ళడయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో.. ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుంది అనేది చూడాల్సి ఉంది. ఆ రెండు స్థానాలలో నామినేషన్ల దాఖలు తమ తుది తీర్పుకు లోబడి ఉంటాయని సుప్రీంకోర్టు ప్రకటించిన నేపథ్యంలో.. ఆ మార్గదర్శకాలకు అనుకూలంగా ప్రభుత్వం నడుచుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తానికి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అధికార కాంగ్రెస్ పార్టీకి మొట్టికాయ లాంటిదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# కుంగుతున్న రోడ్లు... కూలుతున్న డ్రైన్లు!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** గత వారం రోజులుగా నియోజకవర్గంలో కురుస్తున్న భారీ వ ర్షాలకు ప్రజలు అల్లాడుతున్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం లో ఏ డివిజన్ చూసిన అడుగడుగునా ప్రమాదం పొంచి ఉంది..... అసంపూర్తిగా మిగిలిన ట్రంక్ లైన్, బాక్స్ డ్రైన్ నాలాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులతో ముంపు సమస్య తీరకపోగా... మరింత ప్రమాదకరంగా మారింది. భారీ వర్షాల వరద నీరు పారుతుండడంతో ఎక్కడ మ్యా న్ హోల్స్ తెరిచి ఉన్నాయో?...ఎక్కడ డ్రైనే జీ పొంగిందో? ఎక్కడ రోడ్డు కుంగుతుందో? తెలియని అయోమయ, ఆ భద్రత పరిస్థితి. ఎక్కడ కరెంట్ తీగలు తెగిపడుతాయో... ఎక్క డ కరెంట్ స్తంభాలు కూలి పడుతాయో అని ప్రజలు బిక్కుబిక్కున గడుపుతున్నారు. వాన వస్తే తమ ఇంటి నుంచి ఆచితూచి అడుగు లు వేస్తున్నారు. నియోజకవ ర్గంలో గత వా రం రోజులుగా ఇదే సమస్య వెంటాడుతుంది. సమస్యలను చక్కదిల్లాల్సిన అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు ఉత్సవ విగ్రహాలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు అంటూ ప్రజల నుంచి పలు విమర్శలు వస్తున్నాయి.ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఆయా డివిజన్లలో వరద ముంపు పనులు, డ్రైనేజీ పనులు పూర్తి కాలేదు. కొన్ని కాలనీల్లో ప్రారంభించి, మధ్యలో వదిలేయగా... కొన్నిచోట్ల చిన్నచిన్న పనులు పూర్తికాలేదు. భారీ వర్షాలు కురుస్తుండడంతో చాలా ప్రాంతా లు చెరువులను తలపిస్తున్నాయి. నీటిని తొ లగించేందుకు చాలాచోట్ల మ్యాన్ హోల్స్ తెరిచి ఉన్నాయి.ఇటీవల టీకేఆర్ కమాన్ రో డ్డు పరిధిలో ఓ ఫుడ్ డెలివరీ బాయ్ నాలా లో పడి అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. వరదలో రోడ్డు కనిపించకపో వడంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. హయత్ నగర్ జాతీయ రహదారి పై సర్వీస్ రోడ్డు పూర్తిగా కుంగిపోయింది. శివారు ప్రాంతాలు, లోతట్టు కాలనీల్లో ముంపు నివారణకు ట్రంక్ లైన్, బాక్స్ డ్రైన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతున్నారు. అయితే, పనులన్నీ వానాకాలం రాక ముందే పూర్తి చేయాలి, కానీ అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో వివిధ కాలనీల్లో పనులన్నీ అసంపూర్తిగా మిగిలిన ఉంటున్నాయి. ముంపు నివారణ పనులకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తున్నా...అధికారుల అలసత్వంతో సకా లంలో పనులు పూర్తి కావడం లేదు. వేసవికాలం లోనే డ్రైనేజీ పైప్ లైన్లు, నాలాల్లో పూడికతీత పనులు పూర్తి చేయాలి. డ్రైనేజీ పైప్ లైన్ మరమ్మతులు, ఓపెన్ నాలాల్లో పూడికతీత, కొత్తగా నాలాల నిర్మాణం చేపట్టి ముంపు సమస్యలను పరిష్కరించాలి. కానీ, జీహెచ్ఎంసీ అధికారులు కార్యాలయాల్లో కూర్చుని ఉంటే పనులు ఎలా పూర్తవుతాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.అజమాయిషీ లేకపోవడం... నిధులు సరిపోవడం లేదని... బిల్లులు రాలేదని కాంట్రాక్టర్లు చేపట్టిన పనులను పూర్తి చేయడం లేదు. బీఎన్ రెడ్డి నగర్, హస్తినాపురం వనస్థలిపురం, మన్సూరాబాద్, హయత్ నగర్, నాగోల్ డివిజన్లలో అనే క కాలనీల్లో చేపట్టిన డ్రైనేజీ, ట్రంక్ లైన్, బాక్స్ డ్రైన్ నాలాల నిర్మాణాలు సగంలో నిలిచాయి.ఎల్బీనగర్ నియోజ కవర్గంలోని ఆయా డివిజన్లలో నాణ్యతా ప్రమాణాల లోపంతో నిర్మించి న డ్రైనేజీలు, రోడ్లు భారీ వర్షాలకు కుంగి, కూలిపోతున్నాయి. కోట్లాది రూపాయలతో చేపట్టిన పనులు నాణ్యత లేకపోవడంతో స్వల్పకాలం లోనే కూలిపోతున్నాయి. చైతన్యపురి, కొత్తపేట, గడ్డి అన్నారం, లింగోజిగూడ డివిజన్లలోని అనేక కాలనీల్లో డ్రైనేజీ మ్యాన్ హోల్స్ పూర్తిగా ధ్వంసమయ్యాయి.

## హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలి

**-సంఘటన స్థలాన్ని పరిశీలించిన ప్రజాసంఘాల నాయకులు**



**మంథని,తెలంగాణ దిశ :** మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపూరి క్రాస్ వద్ద లారీ ఢీకొనడంతో రోడ్డు ప్రమాదంలో పెద్దపల్లి జిల్లా కనగర్తి గ్రామానికి చెందిన వెంకటేష్ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా సంఘటన స్థలాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మంథని లింగయ్య లు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగాపురి మూల మలుపు వద్ద వరుసగా అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రజలు చనిపోతున్నారని ఈ మూల మలుపు ప్రమాదాలకు నిలయంగా మారి అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన ప్రమాదాల పట్ల ఆనాడు ప్రజాసంఘాలు ఆర్ అండ్ బి అధికారులకు మున్సిపల్ అధికారులకు అనేకమార్లు తెలియజేసినప్పటికీని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇంకా ఎంతమంది ప్రాణాలు కోల్పోతే కళ్ళు తెరుస్తారని ప్రశ్నించారు. ఈ మూల మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు, సిసి కెమెరాలు ,ట్రాఫిక్ సిగ్నల్స్ , సెంట్రల్ లైటింగ్ మరియు ఫౌంటెన్ ఏర్పాటుచేసి హెచ్చరిక బోర్డులు పెట్టి ప్రమాదాలు జరగకుండా నివారించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన యువకుని కుటుంబానికి 25 లక్షల ఎక్స్ గ్రేషియా ఇచ్చి వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి తీవ్రంగా గాయాలైన తిప్పని అభిలాష్ కు వైద్యం అందించి ఈ ప్రమాదానికి కారణమైన లారీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం

**నిజామాబాద్,తెలంగాణ దిశ :** ల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. సర్పంచ్ల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఒక్కో అధికారికి రెండు, మూడు గ్రామాల బాధ్యతలు ఉండడంతో పర్యవేక్షణ ఇబ్బందికరంగా మారింది. పల్లెల్లో పారిశుధ్యం లోపించి అస్తవ్యస్తంగా మారాయి. వీధుల్లో చిన్న గుంత ఏర్పడినా పూడ్చేవారే కరువయ్యారు.ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతు న్నది. ఈగలు, దోమల బెడద పెరిగి వ్యాధులు వి జృంభిస్తున్నాయి. పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. సర్పంచ్ల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగు తోంది. ఒక్కో అధికారికి రెండు, మూడు గ్రామాల బాధ్యతలు ఉండడంతో పర్యవేక్షణ ఇబ్బంది కరంగా మారింది.గ్రామాల్లో ఏవైనా సమస్యలున్నా చెప్పుదామంటే అధికారులు అందుబాటులో ఉండడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి మండలంలో ప్రత్యేకాధి కారుల పాలనలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. గ్రామాల్లో సర్పంచ్ల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి గ్రామాలను పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. గ్రామాల్లో ఎక్కడ చూసిన చెత్తాచెదారం పేరుకుపోయింది. పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో ప్రత్యేకాధికారులు నామమాత్రంగా పని చేస్తున్నారు. గ్రామాల్లో, పలుచోట్ల వీధి దీపాలు చాలా రోజుల నుంచి వెలగడం లేదు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో గ్రామాల్లోని పరిస్థితి అధ్వానంగా తయారైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో, పల్లె, పట్టణ ప్రగతి పేరిట ప్రతినెలా జిల్లాకు రూ.12 కోట్ల నుంచి రూ.16 కోట్లు ఇచ్చి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టింది. గ్రామాలకు కేంద్రం నిధులు ఇచ్చినా ఇవ్వకపోయినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆపలేదు. దాంతో రాష్ట్రంలోని పల్లెలు కొత్త రూపు సంతరించుకున్నాయి. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో పల్లెలు దారుణంగా మారాయి.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పద్దెనిమిది నెలలు దాటినా ఇటు రాష్ట్రం నుంచి అటు కేంద్రం నుంచి పంచాయతీలకు నిధులు రావడం లేదు. ఇటీవల కాంగ్రెస్ సర్కారు ఎంతో ఆర్భాటంగా స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమం నిర్వహించినప్పటికీ నయాపైసా ఇవ్వకపోవడంతో తూతూ మంత్రంగా జరిగిపోయింది. ప్రస్తుతం ఏ గ్రామానికి వెళ్లినా మురికి గుంతలు, చెత్తా చెదారంతో నిండిన వీధులు, పెరుగుతున్న పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. మండలంలో 31 గ్రామ పంచాయతీలుండగా గ్రామ పంచాయతీలకు నెలనెల రావాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు జమ కాకపోవడంతో జీపీల నిర్వహణ పంచాయతీ కార్యదర్శులకు భారంగా మారింది. అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు ఉన్నప్పటికీ వారితో పని చేయించే వారు లేరు. సర్పంచులు లేక, ప్రత్యేకాధికారులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఒక్కో కార్యదర్శికి రెండు, మూడు గ్రామాల బాధ్యతలు అప్పగించడంతో వారు ఏ గ్రామంలో ఉంటున్నారో తెలియని పరిస్థితి ఉంది సర్పంచుల పదవీ కాలం పూర్తయిన తర్వాత పల్లెల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై పడింది. జిల్లాలోని ఆయా పంచాయతీల్లో సెక్రటరీలు చేసిన అప్పులు ఒక్కొక్కరివి రూ.50 వేల నుంచి రూ. లక్షల వరకు ఉన్నట్లు సమాచారం.ప్రభుత్వం ఇటీవల ఉద్యోగుల బదిలీలకు జీఓ తీసుకురావడంతో ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న పంచాయతీ సెక్రటరీలు కూడా తమ అర్హతను బట్టి ఎక్కడి వెళ్లాలో వెతుక్కునే పనిలో, పడి బదిలీ అయ్యారు. మరోపక్క బదిలీ అయినా సెక్రటరీలు తాము ఖర్చులు చేసిన బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొందని పలువురు సెక్రటరీలు మదనపడుతున్నారురోజు వారీగా చెత్తను తొలగించక పోవడంతో రోడ్లపైనే చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. కొన్ని గ్రామాల్లో డంపింగ్ యార్డుల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. కొన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు అందడం లేదు. వీధి దీపాలు ఎప్పుడు వెలుగుతున్నాయో, ఎప్పుడు ఆరిపోతున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. సర్పంచులు ఉంటే తాము వారికి సమస్యలు తెలిపిన వెంటనే పరిష్కరించేవారని, ఇప్పుడు అధికారులు ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి ఉందనిప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల బాగోగులు ప్రజా ప్రభుత్వ పాలనలో బాగుపడాలి. అంటే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి ప్రత్యేక అధికారుల పాలన నుండి స్థానిక సర్పంచ్ల పాలనలోకి చేరితే అధికారులకు ప్రజలకు సమన్వయంగా ఉంటుందని స్థానిక గ్రామ ప్రజలు పలువురు పేర్కొంటున్నారు. గ్రామపంచాయతీలో ప్రత్యేక అధికారుల పాలనలో పరిపాలన కొనసాగుతుందని ప్రభుత్వం నుండి సమయానికి నిధులు రాకపోవడంతో కొన్ని సందర్భాలలో తమ చేతి నుండి డబ్బులు ఖర్చు చేసి గ్రామపంచాయతీలో పలు అభివృద్ధి పనులు చెత్త ట్రాక్టర్లు గాని త్రాగునీటి సమస్యకు గ్రామాలు గ్రామాలలో మోటార్ల రిపేర్లు, పైప్ లైన్ మరమ్మత్తులు, అధికారులుగా ఉన్న వారే చేతి నుంచి డబ్బులు ఖర్చు చేసి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన తర్వాత తీసుకోవడం జరుగుతుందని మండల పరిషత్ అధికారి తెలిపారు. గ్రామ పంచాయతీలకు నిధులు లేక ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




# టారిఫ్‌ల తుపాన్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అనేక ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారు. ఈ సమయంలోనే అమెరికా ప్రారంభించిన ట్రేడ్ వార్ ప్రభావం కూడా పెరిగింది. టారిఫ్‌ల తుపాన్ దేశంలోని పలు రంగాలను తీవ్రంగా దెబ్బ తీస్తోందన్న వార్తలు వస్తున్నాయి. మన దేశ ఎగుమతులపై 25నుండి 50శాతం వరకు భారీగా పెంచిన సుంకాలు దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్ద దెబ్బకొడుతున్నాయన్నది ఈ వార్తల సారాంశం. అధిక సుంకాలు సీ-ఫుడ్, టెక్స్‌టైల్స్, రత్నాలు, యంత్రాలు వాటి విభాగాలపై ప్రభావం చూపుతున్నాయి. దేశీయ ఎగుమతిదారులు ఒక్క రోజులోనే గణనీయమైన పతనాన్ని చూడాల్సిరావడం ఆందోళనకలిగిస్తోంది. అమెరికా మార్కెట్‌పై అధికంగా ఆధారపడిన వారికి 30 నుండి 40 శాతం మేర ఆర్డర్లు తగ్గినట్లు, దాదాపు ఆ స్థాయిలోనే ఆదాయంలో కూడా తగ్గుదల నమోదైనట్లు ఆర్థిక నిపుణుల అంచనా! దేశ వ్యాప్తంగా మారుమూల ప్రాంతాలకు సైతం ఆన్‌లైన్ వ్యాపారాన్ని విస్తరించి, లాభాలు పోగుచేసుకుంటున్న అమెజాన్ సంస్థ కొత్త ఆర్డర్లను నిలిపివే సింది. మరో దిగ్గజ సంస్థ వాల్‌మార్ట్ కూడా అదేబాటన నడిచింది. వాటితో పాటు మరికొందరు అమెరికా కొనుగోలుదారులు కూడా వియత్నాం, బంగ్లాదేశ్, ఈక్వెడార్ వంటి తక్కువ టారిఫ్ కలిగిన దేశాలవైపు మళ్లిపోయారు. ఫలితంగా ఆర్డర్లలో భారీగా తగ్గుదల నమోదైంది. తొలి రెండురోజుల్లోనే 40 శాతం వరకు ఈ తగ్గుదల నమోదుకాగా, భవిష్యత్తులో ఇది 50 శాతం దాటుతుందని అంచనా!

ఈ సంక్షోభ ప్రభావం మన రాష్ట్రంపై కూడా తీవ్రంగా పడుతోంది. దేశ వ్యాప్తంగా జరుగుతున్న సీ-ఫుడ్ ఎగుమతులలో మూడవ వంతు మన రాష్ట్రం నుంచే జరుగుతుండటం గమనార్హం. మన దేశం నుండి జరుగుతున్న సీ-ఫుడ్ ఎగుమతుల్లో అత్యధిక వాటా రొయ్యలదే కాగా, దానిలో ఆంధ్రప్రదేశ్ వాటా 60 శాతానికి పైగా ఉంటుందని అంచనా! రొయ్యల సాగుకు కీలకమైన హార్వెస్టింగ్ సీజన్ సాగుతున్న ప్రస్తుత సమయంలోనే ట్రంప్ విధించిన కొత్త సుంకాలు అమలులోకి వచ్చాయి. దీని ప్రభావం వెంటనే రైతులు, ఎగుమతిదారులపై పడింది. ఫామ్ గేటువద్దే 19శాతం ధర పడిపోయినట్లు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 6.5 లక్షల మంది రొయ్యల రైతుల మీద, ఆ రంగంపై ఆధారపడి పొట్టపోసుకుంటున్న మరో 30నుండి 40 లక్షల మందిపైనా దీని ప్రభావం తీవ్రంగా పడనుంది. ఆంధ్రప్రదేశ్ తరువాత ఒడిషా, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు ఈ రంగంలో తీవ్ర నష్టాలను ఎదుర్కుంటున్నాయి. ఉత్తర, మధ్య భారతంలోని అనేక రాష్ట్రాలు టెక్స్‌టైల్స్, యంత్రాల ఎగుమతులపై విధించిన టారిఫ్‌ల కారణంగా నష్టాలను ఎదుర్కుంటున్నాయి. ప్రధాన మంత్రి సొంత రాష్ట్రమైన గుజరాత్ నుండి పెద్ద ఎత్తున జరుగుతున్న టెక్స్‌టైల్స్ ఎగుమతులపై టారిఫ్‌లు తీవ్ర పభ్రావాన్ని చూపించాయి. అమెరికాతో జరిగే టెక్స్‌టైల్ వ్యాపారంలో గుజరాత్‌ది దాదాపు 35శాతం వాటా కాగా, ప్రస్తుతం యార్న్ నుండి ఫ్యాబ్రిక్ వరకు మొత్తం ఉత్పత్తులు నిలిచిపోయాయి. దీంతో లక్షలాది మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. అనేక చిన్న, మధ్యతరహా వ్యాపారాలు (ఎంఎస్‌ఎంఇలు) మూసివేత ముప్పును ఎదుర్కొంటున్నాయి.

ఇంత జరుగుతున్నా మోడీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేకపోవడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపి, దేశాన్ని పతనం దిశకు నెట్టకము ందే కేంద్ర ప్రభుత్వం మేల్కోవాలి. తక్షణ, దీర్ఘకాల ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందించి, అమలు ప్రారంభించాలి. కార్పొరేట్ అనుకూల, ఉదారవాద విధానాల అమలు నేపథ్యంలో దేశ విదేశాంగ విధానాన్ని, ఇప్పటికైనా అమెరికా చేస్తున్న వాణిజ్యయుద్ధాన్నిఎదుర్కొనాలి. కేంద్ర ప్రభుత్వం సరైన వ్యూహంతో దాన్ని తిప్పికొట్టాలి. ఆక్వా, టెక్స్‌టైల్ తదితర రంగాలపై తీవ్ర ప్రభావం పడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వంపై తగిన ఒత్తిడి తేవడం టిడిపి కూటమి సర్కారు విద్యుక్త ధర్మం.

## మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో మారనున్న మంథని ప్రభుత్వ ఆసుపత్రి రూపురేఖలు

**- ఇద్దరు నూతన డాక్టర్ల నియామకం**

**-వెయిటింగ్ హాల్ నిర్మాణం**

**-అల్ట్రా సౌండ్, వర్మర్, ఫోటో థెరపీ ఏర్పాటు**

**-ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాల కోసం 20 లక్షల నిధులు కేటాయించిన మంత్రి**



**మంథని,తెలంగాణ దిశ :** మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో మంథని ప్రభుత్వ ఆసుపత్రి రూపురేఖలు మారనున్నాయి. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాలతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష 20 లక్షల నిధులు మంజూరు చేశారు. మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ల కొరతతో రోగులు ఇబ్బందులు పడకుండా ఉండడానికి ఇద్దరు నూతన డాక్టర్ నియమించారు. రోగుల సౌకర్యార్థం 5 లక్షల రూపాయలతో సామాజిక ఆసుపత్రిలో వెయిటింగ్ హాల్ నిర్మాణం చేశారు. మాత శిశు ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీల కోసం కొత్తగా 12లక్షలతో అల్ట్రా సౌండ్ స్కానింగ్, పుట్టిన పసిపాపల కోసం 1.12 లక్షలతో వార్మర్, ఫోటోతెరపి ఏర్పాటు చేశారు. సామాజిక ఆసుపత్రికి,మత శిశు ఆసుపత్రి నందు రోగుల సౌకర్యం 1.80 లక్షలతో అర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేశారు త్వరలో మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా మందులను అందుబాటులో ఉంచుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి పై నమ్మకంతో వస్తున్న రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించడమే మా ప్రథమ లక్ష్యమని జిల్లా మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ శ్రీధర్ అన్నారు.

## మారనున్న 9 దేవాలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

**ఖమ్మం,తెలంగాణ దిశ:** తెలంగాణ దేవాదాయ శాఖ ఆలయాల అభివృద్ధికి.. భక్తుల సౌకర్యార్థం మెరుగైన వసతులకు ప్రణాళికలు రచించింది. ఈ నేపథ్యంలో.. తొమ్మిది ముఖ్య క్షేత్రాలకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసి.. రూ. 779.74 కోట్ల నిధులు కేటాయించింది. మంత్రి కొండా సురేఖ ఈ పథకాలను ప్రకటించారు. ఆలయాల అభివృద్ధికి నిధులివ్వడమే కాక.. దేవాలయాల భూములను కాపాడేందుకు డిజిటలైజేషన్ మొదలుపెట్టారు. ఈ సంస్కరణలు దేవస్థానాల పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణలోని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న దేవాలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ క్రమంలో.. రాష్ట్రంలోని తొమ్మిది ప్రముఖ దేవాలయాల కోసం ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను రూపొందించింది..అఉఈ, ఇతర నిధుల నుంచి మొత్తం రూ. 779.74 కోట్లతో ఈ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. తెలంగా ణలో 48 ఆలయాల్లో ఎస్డీఎఫ్ పనులకు రూ.64 కోట్లకు పైగా నిధులు కేటాయించనున్నారు. ఆర్ అండ్ బీ వర్క్ కింద 24 దేవాలయాల్లో రూ.7.86 కోట్లు ఇవ్వనున్నారు. వీటితో పాటు.. మ తెలంగాణలో చిన్న చిన్న ఆలయాలకు రూ.502 కోట్లను సీజీఎఫ్ నిధుల కింద కేటాయించనున్నారు.ఈ మాస్టర్ ప్లాన్‌లో చేర్చిన తొమ్మిది ముఖ్య దేవాలయాలు ఇలా ఉన్నాయి. వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం,భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయం, బాసర జ్ఞానసరస్వతి దేవస్థానం, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం, కొడంగల్ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానం, ఆలంపూర్లోని జోగులాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం,కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయం, ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం, చెర్వుగట్టు పార్వతిజడల రామలింగేశ్వరస్వామి ఆలయం.ఈ దేవాలయాల అభివృద్ధి కోసం ఇప్పటికే వేములవాడకు రూ. 111.25 కోట్లు, బాసరకు రూ. 50 కోట్లు, భద్రాచలానికి రూ. 34 కోట్లు, కొడంగల్‌కు రూ. 30 కోట్లు వంటి నిధులు కేటాయించారు. ఇది ఆలయాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడమే కాకుండా, పర్యాటక రంగానికి కూడా ఊతమిస్తుంది.దేవాలయాల అభివృద్ధిపై దృష్టి సారించడంతో పాటు, దేవాదాయ భూముల పరిరక్షణకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. హైదరాబాద్‌లోని బొగ్గులకుంట ఎండోమెంట్ ఆఫీసులో జరిగిన బోనాల వేడుకల్లో పాల్గొన్న మంత్రి సురేఖ, కద్దాల్ గ్రామంలో ఎండోమెంట్ ల్యాండ్స్ డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ ప్రక్రియను ఏడాదిలోగా పూర్తి చేస్తామని ఆమె తెలిపారు.ఈ చర్యల ద్వారా దేవాదాయ భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే.. దేవాదాయ శాఖలో ఫైళ్ల క్లియరెన్స్‌ను వేగవంతం చేయడానికి ఈ-ఆఫీసు విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ నూతన విధానం వల్ల పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు పారదర్శకంగా ముందుకు వెళ్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ సంస్కరణలు దేవాదాయ శాఖలో మరింత జవాబుదారీతనాన్ని, సమర్థతను పెంచే అవకాశాలు ఉన్నాయి.

## గుజరాత్‌లో పరువు హత్య !



**కాపాడాలంటూ బాయ్‌ఫ్రెండ్‌కు మెసేజ్..**

అహ్మదాబాద్: గుజరాత్‌లో పరువు హత్య జరిగింది. 18 ఏళ్ల అమ్మాయి మృతి పట్ల అనుమానాలు వ్యక్తం అయ్యాయి. దీంతో ఆ కేసును దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఆ మర్డర్ కేసులో తండ్రే హంతకుడు అని తేల్చారు. బనస్కాంత జిల్లాలో ఈ ఘటన జరిగింది. పోలీసులు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.. చంద్రికా చౌదరీ అనే 18 ఏళ్ల అమ్మాయి నుంచి ఆమె ప్రియుడు హరీశ్ చౌదరీ ఫోన్‌కు ఓ మెసేజ్ వచ్చింది. తనను కాపాడాలి అంటూ ఆ మెసేజ్‌లో ఉంది. కానీ ఆ రోజు రాత్రే చంద్రిక ప్రాణాలు విడిచింది. ఆమె సహజ కారణాల వల్ల మరణించినట్లు భావించారు. ఇంట్లో వాళ్లు ఎవరికీ తెలియకుండానే అంత్యక్రియలు నిర్వహించారు. కనీసం ఆమె సోదరుడికి కూడా చంద్రిక విషయాన్ని చెప్పలేదు. కానీ ఆమె ప్రియుడు హరీశ్ చౌదరీకి అనుమానం రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చంద్రిక పంపిన మెసేజ్‌లను పోలీసులకు ఫార్వర్డ్ చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు కేసును ఛేధించారు. తండ్రి సేధాబాయ్ పటేల్, చిన్నాన శివభాయ్ పటేల్ ఆ హత్య చేసినట్లు తేలింది. తారడ్‌లోని థాంటియాలో ఈ మర్డర్ జరిగింది. ఈ కేసులో ఇదర్ని అరెస్టు చేశారు. తండ్రి పరారీలో ఉన్నట్లు ఏసీపీ సుమన్ నాలా తెలిపారు. హరీశ్, చంద్రిక.. కొన్నాళ్ల నుంచి రిలేషన్‌లో ఉన్నారు. కానీ ఆమె కుటుంబం హరీశ్‌ను వ్యతిరేకించింది. చంద్రికను మరొకరి ఇచ్చి పెళ్లి చేయాలని భావించింది. ఈ విషయాన్ని హరీశ్‌కు ఆ అమ్మాయి పలుమార్లు చెప్పింది. తన ఫ్యామిలీ నుంచి దూరంగా తీసుకువెళ్లాలని జూన్ 24వ తేదీన ఆమె హరీశ్‌ను వేడుకున్నది. ఒకవేళ నువ్వు తీసుకెళ్లకుంటే, తన ఇష్టానికి వ్యతిరేకంగా పెళ్లి చేస్తారని చెప్పిందామె. వాస్తవానికి అంతకుముందు ఇద్దరూ కుటుంబానికి దూరంగా వెళ్లిపోయారు. కానీ పోలీసులు వాళ్లను పట్టుకుని వచ్చారు. చంద్రికను ఇంటికి పంపారు. అయితే మళ్లీ కొన్ని రోజుల్లోనే పరిస్థితి విషమించింది. పేరెంట్స్ చంపేస్తారని హరీశ్‌కు మెసేజ్ వచ్చింది. ఆ తర్వాత ఆమె మృతిచెందింది. చంద్రిక ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసిన హరీశ్ .. హెబియస్ కార్పస్ పిటీషన్ వేశాడు. కానీ ఈలోగా ఆమె ప్రాణాలు కోల్పోయింది. సహజ మరణం చెందినట్లు ఆమె కుటుంబం డెత్ సర్టిఫికేట్ సమర్పించింది. కానీ హరీశ్ దీన్ని నమ్మలేదు. చంద్రిక మరణం కేసులో దర్యాప్తు చేపట్టాలని పోలీసుల్ని కోరాడు. విచారణ సమయంలో పోలీసులకు కొన్ని అనుమానాలు వచ్చాయి. సహజ మరణమే అయినా ఆమెను డాక్టర్ వద్దకు తీసుకెళ్లలేదని, కనీసం బంధువులకు చెప్పలేదని, సోదరుడికి కూడా ఆ విషయం తెలియలేదని గుర్తించారు. దీంతో కుటుంబంపై అనుమానాలు బలపడ్డాయి. చంద్రిక మృతిపై డౌట్స్ రాకుండా ఉండేందుకు.. తొలుత ఆమెకు మత్తు మందు ఇచ్చారు. ఆ తర్వాత ఆమె గొంతు నొక్కారు. ఆ తర్వాత ఉరి వేసుకున్నట్లు చిత్రీకరించారని పోలీసులు తెలిపారు. సూసైడ్ చేసుకున్నట్లుగా నమ్మించి ఆ తర్వాత సహజంగా మరణించినట్లు చెప్పారని పోలీసులు పేర్కొన్నారు.

## ప్రకృతి విపత్తులలో ప్రజల రక్షణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నాం...



**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల,తెలంగాణ దిశ :** వాతావరణ శాఖ సూచన మేరకు రాబోవు 2 రోజులలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజల రక్షణ కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని మంచిర్యాల పట్టణం తిలక్ నగర్ ప్రాంతంలో గల చెరువును డి.సి.పి. ఎ.భాస్కర్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు, ప్రజల రక్షణ కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జిల్లాలోని కాజ్ వే లు వాగులు నదుల వద్దకు ప్రజలు ఎవరు వెళ్లకుండా పోలీస్ రెవెన్యూ పంచాయతీ శాఖల అధికారుల సమన్వయంతో బందోబస్తు ఏర్పాటు నిర్వహిస్తున్నామని లోతట్టు వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను వరద పరిస్థితుల దృష్ట్యా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వరదలకు సంబంధించి ఎలాంటి సమస్య వచ్చిన ఎదుర్కొనేందుకు 90 మంది సభ్యులతో 3 ఎస్.డి.ఆర్.ఎఫ్. బృందాలు, జిల్లా అధికారు లతో సిద్ధంగా ఉన్నామని, ప్రజల రక్షణకు కావలసిన పరికరాలు అందుబాటులో పెంచడం జరిగిందని పోలీసు అధికారులకు శిక్షణ అందించడం జరిగిందని గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. ప్రభుత్వ సూచన మేరకు మత్స్యకారులు చేపల వేటకు వెళ్ళవద్దని జిల్లాలోని పాఠశాలలకు సెలవు ప్రకటించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ప్రాణ నష్టం పశు నష్టం ఆస్తి నష్టం జరగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల మార్గదర్శకాలను పాటిస్తూ ప్రజల రక్షణకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ నీళ్లు విడుదల



రామడుగు: రామడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామంలోని గాయత్రి బాహుబలి పంప్ హౌస్ నీరు విడుదలతో చొప్పదండి మాజీ శాసనసభ్యులు సుంకే రవిశంకర్ ఆధ్వర్యంలో గంగమ్మ తల్లికి పసుపు కుంకుమ పువ్వులతో అభిషేకం చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దేశానికే తలమానికంగా నిలిచినటువంటి కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం మూడు సంవత్సరాల వ్యవధిలోనే పూర్తి చేసిన ఘనత కేసిఆర్ కాదా కాంగ్రెస్ ప్రభుత్వం వాళ్లకు కళ్ళు ఉండి చూడలేక పోతున్నారా అలాంటప్పుడు గాయత్రి పంప్ హౌస్ నీళ్లు ఎక్కడినుండి వస్తున్నాయి అంటూ చొప్పదండి మాజీ శాసనసభ్యులు సుంకే రవిశంకర్ సూటిగా విమర్శించారు. కాంగ్రెస్ బిజెపి పార్టీలు కాళేశ్వరం ప్రాజెక్టు కూలింది కుంగింది అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్న వాళ్లకు నిలువెత్తు నిదర్శనమే పరవాళ్ళు తొక్కుతున్న గాయత్రి బాహుబలి పంప్ హౌస్ నీటి ప్రవాహం అని సూచించారు. సముద్ర గర్భంలో కలిసి వృధాగా పోతున్నటువంటి నీటిని కెసిఆర్ ఒక బృహత్తరమైన ఆలోచనతో కాళేశ్వరం నంది మేడారం కన్నెపల్లి అన్నపూర్ణ మిడ్ మానేరు గాయత్రి బాహుబలి పంప్ హౌస్ లాంటి ఎత్తిపోతల పథకాన్ని 600 మీటర్ల లోతు నుండి నీటిని తోడి రైతాంగానికి అందిస్తున్నటువంటి ఘనత కెసిఆర్ ది కాదా అని సుంకే రవిశంకర్ ప్రశ్నించారు అలాంటి మహత్తరమైన కాళేశ్వరం ప్రాజెక్టును నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూలింది కుంగింది అంటూ ప్రజలకు అసత్య ప్రచారం నింపి గద్దెనెక్కిందని విమర్శించారు. అదే కూలిపోయిన ప్రాజెక్టు ద్వారా వస్తున్నటువంటి నీటిని ఈరోజు విడుదల చేసి మేమే రైతాంగానికి నీళ్లు ఇస్తున్నామంటూ ఎందుకు గొప్పలు చెప్పుకుంటున్నారంటూ మాజీ శాసనసభ్యులు రవిశంకర్ ప్రశ్నల వర్షం కురిపించారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామంలోని గాయత్రి బాహుబలి పంప్ హౌస్ నిర్మించడం జరిగిందని 139 మెగావాట్ల సామర్థ్యం ఉన్న పంపులతో 323 మీటర్ల ఎత్తుతో శ్రీ రాజరాజేశ్వర జలశయానికి తరలిస్తున్న ఘనత కేసిఆర్ ది కాదా అని సూచించారు. గత వారం రోజుల క్రితం టిఆర్ఎస్ ఆధ్వర్యంలో కన్నేపల్లి వద్ద పంపులు ఆన్ చేసేందుకు వెళ్లిన నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో వారం రోజుల్లో నీటి విడుదల జరగకపోతే ఎట్టి పరిస్థితుల్లో మేము నీటిని విడుదల చేస్తామంటూ హెచ్చరించడం ఆ ఫలితమే ఈరోజు బాహుబలి గాయత్రి పంప్ హౌస్ నీటి విడుదల జరిగిందని సుంకే రవిశంకర్ సూచించారు. పది సంవత్సరాల కెసిఆర్ ప్రభుత్వంలో రైతులు యూరియా బస్తాల కోసం చెప్పులు వరుస క్రమంలో పెట్టిన దాఖలాలు ఎక్కడైనా ఉన్నాయా అంటూ అదే సంవత్సరం నర గడిచిన వ్యవధిలోనే మళ్లీ మొదటికి వచ్చిందని రైతులు యూరియా బస్తాల కోసం చెప్పులు వరుసలో పెట్టవలసి వస్తుందని కనీసం రైతులకు ఎరువులు అందించే పరిస్థితి లేని దుస్థితి ఎదురైందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా రైతన్నను దృష్టిలో పెట్టుకొని సాగునీటిని విడుదల చేయడం అది కెసిఆర్ ఘనత అని సూచించారు. ఈ కార్యక్రమంలో రామడుగు టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్ రెడ్డి మురళి చాడ శేఖర్ రెడ్డి గంటల వెంకటరెడ్డి కరబూజ తిరుపతి గౌడ్ ఒంటెల రమణారెడ్డి చాడ రాజేందర్ రెడ్డి జూపాక మునీందర్ సైన్ల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బేంగబజార్‌లో కుప్పకూలిన పురాతన భవనం

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్‌లోని బేగంబజార్‌లో కొన్ని రోజులు గా కురుస్తున్న వర్షాలకు ఓ పురాతన భవనం కుప్పకూలింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ భవనం శిథిలావస్థకు చేరుకొందని, దాన్ని కూల్చేయాలని గతంలోనే జీహెచ్ఎంసీ అధికారులు ఆ భవనం యజమానికి నోటీసులు ఇచ్చినా పట్టించుకోలేదు. బేగంబజార్‌లో ఇలాంటి పురాతన భవనాల్లోనే వ్యాపారులు ఇప్పటికీ దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ రద్దీ ఎక్కువగా ఉండటంతో శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటివాటిపై బల్దియా అధికారులు కేవలం నోటీ-సులు ఇచ్చి వదిలేయడమే కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## కరిగిపోయిన విదేశీ నిల్వలు




న్యూఢిల్లీ: విదేశీ నిల్వలు క్రమంగా కరిగిపోతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో మన కరెన్సీ బలహీనపడటంతో గతవా రాంతం నాటికి విదేశీ మారకం నిల్వలు 9.3 బిలియన్ డాలర్లు తరిగిపోయాయని రిజర్వు బ్యాంక్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. దీంతో విదేశీ నిల్వలు 689 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అయినప్పటికీ దేశీయ 11 నెలల దిగుమతులకు సరిపడా విదేశీ నిల్వలు ఉన్నాయి. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ తరిగిపోవడం ఇందుకు కారణమని తన వారాంతపు సమీక్షలో వెల్లడించింది. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న విలువ 581.607 బిలియన్ డాలర్లకు తగ్గాయి. అలాగే గోల్డ్ రిజర్వులు 1.706 బిలియన్ డాలర్లు కరిగిపోయి 83.998 బిలియన్ డాలర్లకు పరిమితమం అయ్యాయి.

## సెప్టెంబర్ నుంచి బీఎండబ్ల్యూ కార్లు ప్రియం




ప్రముఖ ప్రీమియం కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ ఇండియా కార్ల ధరలు పెంచింది. కంపెనీ పోర్ట్‌ఫోలియోలోని అన్ని కార్ల ధరలను సెప్టెంబర్ 1 నుంచి 3 శాతం పెంచుతున్నట్టు అధికారిక ప్రకటనలో వెల్లడించింది. ఫారెక్స్ నిల్వల్లో నిరంతర హెచ్చుతగ్గులు, ప్రపంచ సరఫరాలో నెలకొన్న అనిశ్చితి కారణంగా ప్రతికూల పరిస్థితులు ఉన్నాయని, ఖర్చులు పెరుగుతున్నాయని కంపెనీ వివరించింది. ఈ కారణంగానే తప్పనిసరిగా కొంత భారం వినియోగదారులకు బదిలీ చేయాల్సి వస్తోందని కంపెనీ వెల్లడించింది. ఈ ఏడాది ప్రథమార్థంలో అమ్మకాలు ఆశాజనకంగానే ఉన్నాయి. కానీ, విదేశీ మారక ద్రవ్యం తీవ్రంగా హెచ్చుతగ్గులకు లోనవుతోంది. గ్లోబల్ సప్లైలో సైతం సవాళ్ల కారణంగా విడి పరికారాలు, లాజిస్టిక్స్ ఖర్చులు పెరుగుతున్నాయని బీఎండబ్ల్యూ ఇండియా ప్రెసిడెంట్ అండ్ సీఈఓ విక్రమ్ పవా అన్నారు. కాగా, ఈ ఏడాది భారత మార్కెట్లో పండుగ సీజన్ కోసం కొత్త మోడళ్లను లాంచ్ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

# రుణగ్రహీతలకు ఎస్బీఐ షాక్




న్యూఢిల్లీ, : దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) రుణ గ్రహీతలకు షాకిచ్చింది. నూతనంగా గృహ రుణాలను తీసుకునేవారికి అధికం భారం మోపుతున్నది. గృహ రుణాలపై వడ్డీరేటును పావు శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నది.

ఈ నిర్ణయం అమలులోకి వచ్చినట్టు పేర్కొంది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో రుణ గ్రహీతల జేబులకు మరిన్ని చిల్లులు పడబోతున్నాయి. ప్రస్తుతం బ్యాంక్ గృహ రుణాలపై %×త్వతీవర్ తీ్ఘవ%7.50 శాతం నుంచి 8.70 శాతంగా ఆఫర్ చేస్తున్నది.

గతంలో 7.50 శాతం నుంచి 8.45 శాతంగా ఉన్నది. తక్కువ సిబిల్ స్కోర్ ఉండేవారికి అధిక వడ్డీరేటుకు గృహ రుణాన్ని అందించనున్నది. ఈ వడ్డీరేట్ల పెంపు కొత్తగా తీసుకునే రుణాలకు మాత్రమే వర్తించనున్నదని, పాత వాటికి వర్తించదని బ్యాంక్ స్పష్టంచేసింది.

ఆర్బీఐ వడ్డీంచకపోయినప్పటికీ రిజర్వుబ్యాంక్ తన పరపతి సమీక్షలో కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ ఎస్బీఐ మాత్రం వడ్డీరేట్లను పెంచడం విశేషం. రెపోరేటును 5.55 శాతంగా ఉంచిన విషయం తెలిసిందే. ఎస్బీఐ తీసుకున్న నిర్ణయంతో ఇతర బ్యాంకులు కూడా గృహ రుణాలపై వడ్డీరేట్లను పెంచే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఓవర్‌డ్రాఫ్ట్ ఫెసిలిటీ కలిగిన గృహ రుణంపై వడ్డీరేటు 7.75 శాతం నుంచి 8.95 శాతంగా వసూలు చేస్తున్నది. అలాగే టాప్–అప్ రుణాలపై బ్యాంక్ 8 శాతం నుంచి 10.75 శాతం చొప్పున వడ్డీని వసూలు చేస్తున్నది. ఉదాహరణకు 20 ఏండ్ల కాలపరిమితితో రూ.30 లక్షల గృహ రుణం తీసుకునేవారు 8.45 శాతం వార్షిక వడ్డీతో రూ.25,830 ఈఎంఐలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ వడ్డీరేటు 8.70 శాతానికి పెంచడంతో ఈఎంఐ రూ.26,278కి చెల్లించాల్సివుంటుంది. అంటే నెలకు రూ.450 అదనంగా చెల్లించాల్సివుంటుంది. అంటే మొత్తం గృహ రుణంపై లక్ష రూపాయలు చెల్లించాలి. తక్కువ స్థాయి రుణాలతోపాటు రూ.50 లక్షలకు పైగా రుణాలు తీసుకున్నవారికి కూడా భారం పడనున్నది. మరో ప్రభుత్వరంగ సంస్థ యూనియన్ బ్యాంక్ కూడా గృహ రుణాలపై వడ్డీరేటును పది బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో గతంలో 7.35 శాతంగా ఉన్న గృహ రుణాలపై వడ్డీరేటు 7.45 శాతానికి ఎగబాకింది. ఎంసీఎల్ఆర్‌ని తగ్గించిన పలు బ్యాంకులు ఎస్బీఐ మరో కీలక నిర్ణయం తీసుకున్నది. ఒకవైపు గృహ రుణాలపై వడ్డీరేట్లను పెంచిన బ్యాంక్..మరోవైపు మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండింగ్ బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేట్లను 5 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఈ నూతన రేట్లు శుక్రవారం నుంచి అమలులోకి వచ్చాయని పేర్కొంది. దీంతో ఒక్కరోజు, నెల కాలపరిమితి కలిగిన రుణాలపై వడ్డీరేటు 7.95 శాతం నుంచి 7.90 శాతానికి దించింది. అలాగే నెల రోజుల రుణాలపై వడ్డీరేటు 8.8 శాతం నుంచి 8.75 శాతానికి దించిన బ్యాంక్..రెండేండ్లు, మూడేండ్ల రుణాలపై రేటును 8.85 శాతం నుంచి 8.80 శాతానికి తగ్గించింది. ఎస్బీఐతోపాటు బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ), ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్(ఐవోబీ) కూడా ఎంసీఎల్ఆర్‌ని 35 బేసిస్ పాయింట్ల వరకు కోత పెట్టింది. దీంట్లో బీవోబీ ఎంసీఎల్ఆర్‌ని 35 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది.

# తగ్గనున్న బీమా ప్రీమియం!




న్యూఢిల్లీ, : జీఎస్టీ రేట్లను తగ్గిస్తూ కేంద్ర సర్కార్ తీసుకున్న కీలక నిర్ణయం సామాన్యులకు సైతం భారీ ఊరట లభించబోతున్నది. ఈ నిర్ణయంతో పలు రకాల ఉత్పత్తుల ధరలు తగ్గనుండటంతోపాటు బీమా పాలసీల ధరలు కూడా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్న నరేంద్ర మోదీ సర్కార్..దీనిని 5 శాతానికి కుదించేయోచనలో ఉన్నది. దీంతో ఈ రెండు రకాల పాలసీలు తీసుకున్నవారికి ఆర్థిక ప్రయోజనాలు కలుగడంతోపాటు బీమా ప్రీమియం చెల్లింపులు తగ్గనున్నాయి. బీమా ప్రీమియంలపై విధిస్తున్న జీఎస్టీని తగ్గించాలని బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ ఇప్పటికే పలుమార్లు కేంద్రానికి సూచించిన విషయం తెలిసిందే. 2047 నాటికి భారతీయులందరికి బీమా ఉండాలనే నినాదంతో ముందుకుసాగుతున్న ఐఆర్‌డీఏఐ..ఈ జీఎస్టీ తగ్గింపు కొంతలో కొంత మేలు చేయనున్నది. బీమా ప్రీమియంపై జీఎస్టీని 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గించాలని సూచించింది. బీమా పరిధిని మరింత విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు చేస్తున్న ప్రయోజనాలు బెడిసికొడుతున్నాయి. గతంలో నాలుగు శాతంగా ఉన్న బీమా వినిమయం 2023–24 ఆర్థిక సంవత్సరంలో 3.7 శాతానికి పరిమితమైంది. దీంట్లో నాన్–లైఫ్ వినిమయం ఒక్క శాతంగా ఉండగా, లైఫ్ ఇన్సూరెన్స్‌లు 3 శాతంగా నమోదయ్యాయి. 2019–20 ఆర్థిక సంవత్సరంలో రూ.2,101 కోట్ల జీఎస్టీని వసూలు చేసిన బీమా సంస్థలు..2023–24 నాటికి రూ.16,398 కోట్ల ఆదాయాన్ని వసూలు చేశాయి.


## ఫాస్టాగ్ వార్షిక పాస్.. తొలిరోజు 1.4 లక్షల మంది కొనుగోలు

స్వాతంత్ర్య దినోత్సవం నుంచి దేశంలో ఫాస్టాగ్ టోల్ చెల్లింపు విధానంలో పెనుమార్పులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. తరచూ ప్రయాణించే వారికి మరింత సులభ, చౌక హైవే ప్రయాణాన్ని కల్పించేందుకు కొత్తగా ఫాస్టాగ్ వార్షిక పాసును నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) అందుబాటులోకి తెచ్చింది. ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్ల కోసం ప్రవేశపెట్టిన రూ.3,000 వార్షిక హైవే టోల్ పాసు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలలోని సుమారు 1,150 టోల్ ప్లాజాల్లో %ఖీూఐుఖ్త్ర% వార్షిక పాస్ సౌకర్యాన్ని ఎన్‌హెచ్‌ఏఐ విజయవంతంగా అమలు చేసింది. తొలి రోజు సాయంత్రం 7 గంటల వరకు దాదాపు 1.4 లక్షల మంది వినియోగదారులు వార్షిక పాస్‌ను కొనుగోలు చేసి




యాక్టివేట్ చేసుకున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ వెల్లడించింది. అదేవిధంగా టోల్ ప్లాజాల్లో దాదాపు 1.39 లక్షల లావాదేవీలు నమోదైనట్లు తెలిపింది. ఈ వార్షిక పాస్ తీసుకున్న వినియోగదారులు ఎస్ఎమ్ఎస్ ద్వారా జీరో టోల్ మెసేజ్ అందుకుంటున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ వివరించింది. ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్లకు మాత్రమే ఈ వార్షిక ఫాస్టాగ్ పాస్ వర్తిస్తుంది. ఎన్‌హెచ్‌ఏఐ నిర్వహించే జాతీయ హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలపైన టోల్ చార్జీలు చెల్లించేందుకు ఒకేసారి డబ్బు చెల్లించి ఫాస్టాగ్ వార్షిక పాసును తీసుకోవచ్చు. ఈ పథకం కింద వాహన యజమానులు ఒకేసారి రూ. 3,000 చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదిపాటు ఎన్‌హెచ్‌ఏఐ నిర్దేశించిన జాతీయ రహదారుల్లో 200 వరకు టోల్ ప్లాజాలను దాటవచ్చు. ఒకవేళ గరిష్ఠ పరిమితి (200 టోల్ క్రాసింగ్‌లు) ఏడాదిలోపలే ముగిసిపోతే ఆటోమేటిక్‌గా సాధారణ విధానంలోకి ఫాస్టాగ్ మారిపోయి డబ్బు చెల్లించి టోల్ దాటవలసి ఉంటుంది. వార్షిక ఫాస్టాగ్ పాసు కొనేందుకు వాహనదారులు తమ వాహన నంబరు, ఫాస్టాగ్ ఐడీ ఉపయోగించి రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా ఎన్‌హెచ్‌ఏఐ/ఎంఓఆర్‌టీహెచ్ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వాలి. తమ ఫాస్టాగ్ యాక్టివ్‌గా, సక్రమంగా ఇన్‌స్టాల్ అయి ఉందో లేదో ధ్రువీకరించుకోవాలి. యూపీఐ, డెబిట్ లేదా క్రెడిట్ కార్డు లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో రూ. 3,000 చెల్లించాలి. ఆగస్టు 15న పాసు యా క్టివేట్ అవుతుంది. యూజర్లకు ఎస్ఎంఎస్ ద్వారా కన్ఫర్మేషన్ మెసేజ్ అందుతుంది. ఫాస్టాగ్ వార్షిక పాసు ఇతరులకు బదిలీ కాదు. రిజిస్టర్డ్ వాహనానికి మాత్రమే పనిచేస్తుంది. అంతేగాక ఈ పాస్‌ను ఒకసారి కొనుగోలు చేస్తే మళ్లీ డబ్బు వాపసు వచ్చే అవకాశం ఉండదు. పాసు ఆటోమేటిక్‌గా రెన్యూ కాదు. దాని గడువు తీరిన తర్వాత మళ్లీ కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

## వెండి ధరల్లో బిగ్ చేంజ్!..



గత కొన్ని రోజులుగా తగ్గుతూ ఊరటనిచ్చిన బంగారం ధరలు నేడు కూడా ఎలాంటి మార్పు లేకుండా స్థిరంగా కొనసాగుతున్నాయి. కిలో వెండి ధర రూ. 1000 పెరిగింది. హైదరాబాద్ లో ఈరోజు 24 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ.10,135, 22 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ.9,290 వద్ద ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.92,900 వద్ద అమ్ముడవుతోంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,01,350 వద్ద ట్రేడ్ అవుతోంది.విజయవాడ, విశాఖ పట్నంలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 93,050 వద్దకు చేరింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,01,500 వద్ద ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో ఈ రోజు కిలో వెండి ధర రూ. 1,26,000 వద్ద అమ్ముడవుతోంది. ఢిల్లీలో కిలో సిల్వర్ ధర రూ. 1,16,000 వద్ద ట్రేడ్ అవుతోంది.

## తగ్గిన అమరరాజా లాభం

హైదరాబాద్ : అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్.. ప్రస్తు త ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో రూ.164.8 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.249.12 కోట్లతో పోల్చితే లాభం 33 శాతం తగ్గింది. అధిక వ్యయాలే లాభాల క్షీణతకు కారణమని కంపెనీ తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.3,263.05 కోట్ల నుంచి రూ.3,401.08 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.2,957.93 కోట్ల నుంచి రూ.3,190.66 కోట్లకు పెరిగాయి. ఉత్పత్తిలో వినియోగించిన వస్తువు ల వ్యయాలు రూ.1,692.77 కోట్ల నుంచి రూ.1,800.68 పెరిగినట్టు కంపెనీ వెల్లడించింది. సమీక్షా కాలంలో లెడ్ యాసిడ్ బ్యాటరీలు, అనుబంధ ఉత్పత్తుల విభాగం రూ.3,279.79 కోట్లు, న్యూ ఎనర్జీ విభాగం రూ.121.29 కోట్ల ఆదాయం ఆర్జించాయి.




# పండగ సీజన్‌లో స్విగ్గీ కీలక నిర్ణయం.. ప్లాట్‌ఫామ్ ఫీజు పెంపు

నష్టాలు తగ్గించుకుని లాభాల బాట పట్టేందుకు పలు ప్రయత్నాలు చేస్తున్న ఆన్‌లైన్ డెలివరీ వేదిక స్విగ్గీ ఈ పండుగ సీజన్‌లో మరో కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఫ్లాట్‌ఫీజును ప్రస్తుతమున్న రూ.12 నుంచి రూ.14కు పెంచేందుకు నిర్ణయించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. 2023 ఏప్రిల్‌లో స్విగ్గీ తొలిసారిగా యూజర్ల నుంచి ఫ్లాట్ ఫీజును వసూలు చేయడం ప్రారంభించింది. ఈ ఫీజు వద్దన తరువాత కూడా ఆర్డర్‌లలో తగ్గుదల కనిపించకపోవడంతో ఫీజును యథాతథంగా కొనసాగించింది. తాజా పండగ సీజన్‌లో మరోసారి ఫీజను రెండు రూపాయల మేర పెంచినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే, ఈ విషయంపై సంస్థ ఇంకా స్పందించాల్సి ఉంది. స్విగ్గీ రోజుకు 2 మిలియన్ ఆర్డర్లను కస్టమర్లకు చేరవేస్తుంటుంది. తాజా పెంపు కారణంగా సంస్థకు రోజుకు రూ.2.8 కోట్ల చొప్పున అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఏటా ఈ మొత్తం రూ.33.6 కోట్ల వరకూ ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇక పండగ సీజన్ ముగిశాక ఫీజులను మళ్లీ తగ్గించే అవకాశం కూడా ఉందని చెబుతున్నారు. గతంలో పండగ సీజన్‌లో స్విగ్గీతో పాటు జొమాటో కూడా ప్లాట్‌ఫామ్ ఫీజు పెంపుతో ఆదాయాన్ని పెంచుకునే ప్రయత్నం చేశాయి. పెంపు తరువాత కూడా ఆర్డర్‌ల తగ్గుదల లేకపోవడంతో కొత్త రేట్లను కొనసాగించాయి. 2023లో ఫ్లాట్‌ఫీజులు రూ.2గా ఉండేది. గతేడాది నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఫీజును రూ.10కి పెంచాయి. క్విక్ కామర్స్ విభాగంలో పెట్టుబడులను పెంచడంతో స్విగ్గీకి నష్టాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో





సంస్థ తాజాగా ప్లాట్‌ఫామ్ ఫీజును మరోసారి పెంచేందుకు నిర్ణయించింది. 2025–26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో స్విగ్గీ రూ.1197 కోట్ల నష్టాన్ని చవి చూసింది. అంతకుముందు ఏడాది ఇదే కాలంతో పోలిస్తే నష్టాలు రూ.611 కోట్ల మేర పెరిగాయి. అయితే, ఈ ఆర్థిక సంవత్సరం స్విగ్గీ రాబడిలో కూడా అభివృద్ధి కనిపించింది. గతేడాదితో పోలిస్తే ఆదాయం 54 శాతం మేర పెరిగి రూ.4961 కోట్లకు చేరుకుంది. మరోవైపు, స్విగ్గీకి పోటీదారుగా ఉన్న జొమాటో.. ఈ ఏడాది తొలి త్రైమాసికం లాభాల్లో 90 శాతం తగ్గుదల నమోదు చేసింది. ఆదాయం మాత్రం 70.4 శాతం మేర పెరిగి 7167 కోట్లకు చేరుకుంది.

# యూపీఐ పీ2పీ కలెక్ట్ రిక్వెస్టలకు స్వస్తి



న్యూఢిల్లీ: డిజిటల్ మోసాలను అరికట్టేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఏకీకృత చెల్లింపుల వ్యవస్థ (యూపీఐ)లో పీర్ టు పీర్ (పీ2పీ) కలెక్ట్ రిక్వెస్టలకు స్వస్తి పలుకుతున్నట్లు ప్రకటించింది. ఈ అక్టోబరు 1 నుంచి బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్ల (పీఎస్‌పీ) తో పాటు ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి థర్డ్ పార్టీ డిజిటల్ పేమెంట్ యాప్‌లు.. యూపీఐలో పీ2పీ కలెక్ట్ రిక్వెస్ట్ లావాదేవీలను అనుమ తించరాదని ఎన్‌పీసీఐ నిర్దేశించింది. తమ వ్యవస్థలో తదను గుణంగా మార్పులు చేసుకోవాలని కోరింది. యూపీఐ వినియో గదారుల్లో ఒకవ్యక్తి మరో వ్యక్తి నుంచి నగదు కోరేందుకు పీ2పీ కలెక్ట్ రిక్వెస్ట్ ఫీచర్ వీలుకల్పిస్తుంది. ముఖ్యంగా స్నేహితులు లేదా సన్నిహితులు తమ మధ్య తిరిగి చెల్లింపులు లేదా బిల్లు చెల్లింపు భారాన్ని సమంగా పంచుకునేందుకు (స్ప్లిట్టింగ్ బిల్స్) దీన్ని విరివిగా వినియోగించుకుంటు న్నారు.పార్టీ డిజిటల్ పేమెంట్ యాప్‌లు.. యూపీఐలో పీ2పీకలెక్ట్ రిక్వెస్ట్ లావాదేవీలను అనుమతించరాదని ఎన్‌పీసీఐ నిర్దేశించింది. తమ వ్యవస్థలో తదను గుణంగా ప్రస్తుతం ఒక వ్యక్తి పీ2పీ కాల్ రిక్వెస్ట్ లావాదేవీ ద్వారా మరో వ్యక్తి నుంచి రూ.2,000 వరకు పొందే వీలుంది. రోజులో గరిష్ఠంగా 50 లావాదేవీ లు నెరిపేందుకు అనుమతి ఉంది. అయితే, ఈ మార్గంలోనూ డిజిటల్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ఎన్‌పీసీఐ వీటిని నిలిపివేయాలని నిర్ణయించింది.

## జూలై ఎగుమతుల్లో 7 శాతం వృద్ధి




న్యూఢిల్లీ: ఎగుమతుల రంగం రెండు నెలల క్షీణతకు స్వస్తి పలికింది. జూలైలో ఎగుమతులు 7.29 శాతం వృద్ధితో 3,724 కోట్ల డాలర్లుగా (రూ.3.24 లక్షల కోట్లు) నమోదయ్యాయి. ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, వజ్రాభరణాలు, ఫార్మా, కెమికల్స్ రంగాలు ఈ వృద్ధికి ఊతం ఇచ్చాయి. అదే సమయంలో వాణిజ్య లోటు మాత్రం 8 నెలల గరిష్ఠ స్థాయి 2,735 కోట్ల డాలర్లకు (రూ.2.38 లక్షల కోట్లు) దూసుకుపోయింది. గత ఏడాది నవంబరులో నమోదైన వాణిజ్య లోటు 3,177 కోట్ల డాలర్ల (రూ.2.76 లక్షల కోట్లు) తర్వాత నమోదైన గరిష్ఠ స్థాయి ఇదే. వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం దిగుమతులు 8.6౹ వృద్ధితో 6,459 కోట్ల డాలర్లకు (రూ.5.62 లక్షల కోట్లు) చేరాయి.

## నవ లిమిటెడ్ లాభం రూ 3౹౹ కోట్లు...

హైదరాబాద్ : నవ లిమిటెడ్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,232.60 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.399.10 నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 2 శాతం, లాభం 10.5 శాతం తగ్గింది. అయితే గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంతో పోల్చితే మాత్రం ఆదాయం 16.7 శాతం, లాభం 31.8 శాతం వృద్ధి చెందింది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.572.70 కోట్ల ఆదాయంపై రూ.141 కోట్ల లాభాన్ని ప్రకటించింది. సమీక్షా త్రైమాసికంలో మెటల్స్ వ్యాపారంతో పాటు ఎనర్జీ పోర్టుఫోలియో పనితీరుమెరుగ్గా ఉండటం కలిసి వచ్చిందని కంపెనీ పేర్కొంది.



# సినిమా..

### 60 కోట్ల పెట్టుబడి మోసం కేసు..

## శిల్పా శెట్టి, రాజ్ కుంద్రాపై మరోసారి

# చీటింగ్ కేసు నమోదు



బాలీవుడ్ నటి శిల్పా శెట్టి మరియు ఆమె భర్త, వ్యాపారవేత్త రాజ్ కుంద్రా మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. పెట్టుబడి పేరుతో భారీ మొత్తంలో మోసం చేశారన్న ఆరోపణలపై ముంబై పోలీసులు వీరి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కేసును ప్రస్తుతం ముంబై పోలీసుల ఆర్థిక నేరాల విభాగం దర్యాప్తు చేస్తుంది. వివరాలలోకి వెళితే ముంబైకి చెందిన వ్యాపారి, లోటస్ క్యాపిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ డైరెక్టర్ దీపక్ కొఠారీ చేసిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదైంది. 2015నుంచి 2023 మధ్య కాలంలో వ్యాపార విస్తరణ పేరుతో శిల్పా దంపతులు తమ వద్ద రూ. 60.4 కోట్లు తీసుకున్నారని, కానీ ఆ డబ్బును తమ వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కొఠారీ వివరాల ప్రకారం, రాజేశ్ ఆర్య అనే వ్యక్తి ద్వారా తాను శిల్పా-రాజ్ దంపతులను కలిశారట. ఆ సమయంలో వారు 'బెస్ట్ డీల్ టీవీ ప్రైవేట్ లిమిటెడ్' అనే హెూమ్ షాపింగ్ కంపెనీలో డైరెక్టర్లుగా ఉన్నారని, దాదాపు 87.6% వాటా వారిదేనని తెలిపారు. మొదట వీరు 12% వడ్డీతో రూ.75 కోట్ల రుణం కావాలని అడిగారని, కానీ ఆ మొత్తం పన్నులభారం లేకుండా పెట్టుబడిగా మారుస్తే మంచిదని ఒప్పించారని ఆయన వివరించారు. ఈ క్రమంలో కొఠారీ, 2015లో రెండు విడతల్లో రూ.31.9 కోట్లు, రూ. 28.53 కోట్లు బదిలీ చేశారు. 2016లో శిల్పా శెట్టి వ్యక్తిగత గ్యారెంటీ ఇచ్చినా, అదే ఏడాది ఆమె డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారు. అనంతరం, 2017లో మరో ఒప్పందం విఫలమవడంతో కంపెనీ దివాళా ప్రక్రియలోకి వెళ్లినట్లు తెలిసిందని ఆయన పేర్కొన్నారు. దీపక్ కొఠారీ ఫిర్యాదు ఆధారంగా ముంబై పోలీసులు ప్రాథమిక విచారణ నిర్వహించి, మోసం, నమ్మకద్రోహం తదితర సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.మోసం మొత్తం రూ.10 కోట్లకు పైగా ఉండటంతో, కేసును జుహు పోలీస్ స్టేషన్ నుంచి ఆర్థిక నేరాల విభాగానికి బదిలీ చేశారు. ప్రస్తుతం కేసు విచారణ దశలో ఉంది. ఈ కేసు నేపథ్యంలో శిల్పా శెట్టి - రాజ్ కుంద్రా దంపతులు మరోసారి హెడ్ లైన్‌లో నిలిచారు. గతంలోనూ వివాదాల పాలైన రాజ్ కుంద్రా, ఇప్పుడు పెట్టుబడిదారుడి ఫిర్యాదు వల్ల మళ్లీ చర్చలోకి వచ్చారు. ఈ కేసులో విచారణ ఎటు వైపు పోతుందనేది ఆసక్తికరంగా మారింది.

# రంగస్థలం 2 ..

# రంగంలోకి సుకుమార్





ఐకాన్‌స్టార్‌అల్లు అర్జున్‌ని సుకుమార్ పాన్ ఇండియా స్టార్ గా ఆవిష్కరించాడు.పుష్ప, పుష్ప 2 చిత్రాలతో బన్ని ఇంటర్నేషనల్ రేంజుకు ఎదిగాడు. పుష్పరాజ్ హవాకు ఇప్పుడు ఎదురే లేదు. అయితే అల్లు అర్జున్ తర్వాత మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌తో సుక్కూ తన కమిట్ మెంట్ ని ఫుల్ ఫిల్ చేయాల్సి ఉంది. గతంలో చరణ్- సుకుమార్ కాంబినేషన్ లో తెరకెక్కిన గోదావరి నేపథ్య చిత్రం-రంగస్థలం- బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన సంగతి తెలిసిందే. నటుడిగా రామ్ చరణ్ కి గొప్ప పేరు తెచ్చింది. అందుకే సుకుమార్ తదుపరి రంగస్థలం సీక్వెల్ పై దృష్టి సారించాడని గుసగుసలు వినిపిస్తున్నాయి. పుష్ప 2 రిలీజైన తర్వాత సుకుమార్ చాలా గ్యాప్ తీసుకున్నాడు. ఫ్రెష్ ఐడియా కోసం అతడు చాలా కాలంగా వర్క్ చేస్తున్నాడు.



అదే సమయంలో.. రంగస్థలం-సీక్వెల్ స్క్రిప్టును కూడా అతడి టీమ్ రెడీ చేస్తోందని కథనాలొస్తున్నాయి. విదేశాలలో ఫ్యామిలీ వెకేషన్ పూర్తి చేసుకున్న తర్వాత సుకుమార్ కొంత గ్యాప్ తీసుకుని తిరిగిస్క్రిప్టుపై దృష్టి సారించారని తెలిసింది. ఇటీవల స్క్రిప్ట్ పై పని జరుగుతోంది. బౌండ్‌స్క్రిప్ట్ రెడీ కాగానేచరణ్‌కి ఫైనల్ గా కథాంశాన్ని వినిపిస్తాడు. దుబా య్ లో స్క్రిప్టు పనులు చేసేందుకు సుకుమార్ ఎంతో ఆసక్తిగా ఉన్నారని.. తదుపరి అతడు దుబాయ్ వెళతారని కూడా టాక్ వినిపిస్తోంది. రంగస్థలం సీక్వెల్ కి సుకుమార్ స్వయంగా దర్శకత్వం వహిస్తారు. ప్రతిష్ఠాత్మక మైత్రి మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్ తో ఈ సిని మాని నిర్మిస్తుంది. పుష్ప 2 తర్వాత మైత్రిలో తెరకెక్కే అత్యంత ప్రతి ష్ఠాత్మక చిత్రమిదని కూడా తెలుస్తోంది.

# పొలిటికల్ థ్రిల్లర్ భద్రకాళి



విజయ్ ఆంటోని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'భద్రకాళి'. అరుణ్‌ప్రభు దర్శకుడు. సర్వంత్ రామ్ క్రియేషన్స్ పతాకంపై రామాంజనేయులు జవ్వాజి నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ తెలుగులో విడుదల చేస్తున్నది. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, విజయ్ ఆంటోని పాత్ర కొత్త పంథాలో ఉంటుందని, అసాంఘిక శక్తులపై ఓ వ్యక్తి చేసే పోరాటమే ఈ చిత్ర ఇతివృత్తమని మేకర్స్ తెలిపారు. వాగై చంద్రశేఖర్, సునీల్ కృపలానీ, సెల్ మురుగన్, తృప్తి రవీంద్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విజయ్ ఆంటోని, దర్శకత్వం: అరుణ్‌ప్రభు.

# మా నాన్న కష్టాల్లో ఉన్నప్పుడు రజనీకాంత్ ఎంతో సాయం చేశారు



తన తండ్రి మోహన్ బాబు కష్టాల్లో ఉన్నప్పుడు సూపర్‌స్టార్ రజనీకాంత్ ఎంతో సహాయం చేశారని సినీ నటి మంచు లక్ష్మి అన్నారు. రజనీకాంత్ ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు పూర్తి కానున్న సందర్భంగా ఆయనకు సామాజిక మాధ్యమం వేదికగా ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. తన తండ్రి, రజనీకాంత్ మంచి స్నేహితులని, చిన్నప్పుడు పుట్టిన రోజులకు ఆయన తప్పకుండా వచ్చేవారని గుర్తు చేసుకున్నారు. ఆయన తమతో ఎంతో ఆప్యాయంగా ఉండేవారని తెలిపారు. రజనీకాంత్ ఎంత గొప్ప వ్యక్తో తమకు పెద్దయ్యాక తెలిసిందని ఆమె అన్నారు. వారిద్దరు కలిసినప్పుడు చిన్నపిల్లల్లా మారిపోతారని పేర్కొన్నారు.వారి స్నేహం ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని ఆమె ఆకాంక్షించారు. వారిద్దరూ కష్టాల్లో ఉన్నప్పుడు ఒకరి కోసం మరొకరు నిలబడ్డారని తెలిపారు. తన తండ్రి కష్టాల్లో ఉన్నప్పుడు సూపర్‌స్టార్ ఎంతో సాయం చేశారని అన్నారు. సాధారణంగా రజనీకాంత్ తక్కువ నిడివి ఉన్న పాత్రలను చేయరని, కానీ తన తండ్రి కోసం 'పెదరాయుడు' సినిమాలో నటించారని తెలిపారు.ఆ సినిమా తనకు గుర్తింపు తెస్తుందా లేదా అని రజనీకాంత్ చూడలేదని, తన తండ్రి అడిగిన వెంటనే నటించారని తెలిపారు. అలాగే తన తండ్రి కోసం 'రాయలసీమ రామన్న చౌదరి' కథను అందించారని, వారిద్దరిది అంత గొప్ప స్నేహమని ఆమె తెలిపారు.



### బిగ్ బాస్ హౌజ్‌లోకి వెళ్లాలంటే

# పెద్ద అగ్ని పరీక్షే..!




బుల్లితెర ప్రేక్షకులని ఎంతగానో అలరిస్తున్న బిగ్ రియాలిటీ షో బిగ్ బాస్ కార్యక్రమం తెలుగులో సక్సెస్ ఫుల్‌గా ఎనిమిది సీజన్స్ పూర్తి చేసుకుంది. ఇప్పుడు తొమ్మిదోసీజన్ కోసం సిద్ధమైంది. అయితే ప్రతి సీజన్‌లో కూడా కొత్తదనం చూపించేందుకు ట్రైచేసేబిగ్ బాస్ టీం,ఈసారి ప్రేక్షకుల్ని మరింత ఎంటర్‌టైన్ చేసేందుకు సరికొత్త కాన్సెప్ట్‌ని తీసుకువచ్చింది. అదే "అగ్నిపరీక్ష".ఇప్పటికే 18వేల మందికిపైగాసామాన్యుల నుండి దరఖాస్తులు వచ్చాయి.వారి నుండి కేవలం 42 మందిని సెలెక్ట్ చేశారు. అయితే..అసలు ట్విస్టు ఏంటంటే.. ఈ42 మందిలో చివరికి కేవలం ఐదుగురికే మాత్రమే బిగ్‌బాస్‌సీజన్ 9 హౌస్‌లోకి ఎంట్రీలభిస్తుంది.

ఈ ఐదుగురు ఎవరనే దాన్నితేల్చే కీలక బాధ్యత మాత్రం బిగ్ బాస్ హిస్టరీలో మైలురాళ్లుగా నిలిచిన ముగ్గురు టప్ కంటెస్టెంట్స్ చేతుల్లో ఉంది.వారే అభిజిత్,బిందు మాధవి,నవదీప్. గత నాలుగు రోజులుగా అగ్నిపరీక్షషూటింగ్ జరుగుతుండగా, ఆ సిరీస్‌కు సంబంధించి ఒక చిన్న వీడియోలీక్ కావడం, వెంటనే అధికారిక ప్రోమోరిలీజ్ కావడం ఈకాన్సెప్ట్‌పై ఆసక్తిని రెట్టింపు చేసింది. ప్రోమోలో యాంకర్ శ్రీముఖి ఎంట్రీ ఇచ్చి ఇదే మీ స్పాట్‌లైట్. ఇదే మీ ఎంట్రీ టికెట్. కానీ ఇది అంతతేలిక కాదు,"అంటూ వార్నింగ్ ఇస్తుంది.

తర్వాతమైండ్ గేమ్స్‌కి మాస్టర్ అనబడే అభిజిత్‌ఎంట్రీ ఇస్తూ ..నేను మైండ్ గేమ్ ఆడతానని మీకందరికీ తెలుసు.

కానీ ఈసారి మైండ్ బ్లాక్‌అవ్వడానికి సిద్ధంగా ఉండండి అనిచెబుతాడు. ఇకబిగ్ బాస్ ఓటీటీ విన్నర్ బిందు మాధవి తన స్టైల్లో.. మాస్క్ అంటేనే ఫేక్. నా ముందు ఉండేది రెండే ఆప్షన్స్, బ్లాకా?, వైటా? ఈ అగ్నిపరీక్ష అదే తేల్చేద్దాం అంటూ డేరింగ్ స్టేట్‌మెంట్ ఇస్తుంది. చివరగా, సీజన్1లో ఫుల్ ఎంటర్టైన్మెంట్ ఇచ్చిన నవదీప్ కూడా ఎంట్రీ ఇస్తూ సీరియస్ అయిపోకండి.

ఎంటర్టైన్మెంట్ ఉండదని అనుకుంటున్నా రా?నేను ఉన్నాను కదా! ఈఅగ్నిపరీక్షలో మీస్ట్రెస్‌ఎలా తగ్గించాలో,వాళ్లదేలా పెంచాలో చూస్తాను అని కాస్త హ్యూమర్ అద్దుతాడు.చివరి షాట్‌లో ఈ ముగ్గురు శ్రీముఖితో కలసి స్క్రీన్‌పై కనిపిస్తారు.వీళ్ల వెనుక 42 మంది కొత్త కంటెస్టెంట్స్ కనిపిస్తారు. ఈ42 మందిలో చివరికి ఎవరు ఐదుగురు ఫైనల్‌ఎంట్రీపొందుతారు? ఈఅగ్నిపరీక్ష ఎలాంటిఎమోషన్స్, డ్రామా, గేమ్స్ తో నడుస్తుంది? ఈ అన్ని ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలంటే ఆగస్ట్ 22 వరకు వేచి చూడాల్సిందే...

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215